జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 01, సెప్టెంబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


## జనమూ జలమూ ఆయన బలం

- చంద్రబాబు మొదటిసారి సీఎం అయి 30 ఏళ్ళు



**అమరావతి, మహానాడు:** చంద్రబాబు ఈ పేరు తెలియని వారే ఉండరు ప్రపంచ వ్యాప్తంగా చిరకాల స్థాయిలో నిలిచిపోయే బ్రాండ్ ఇమేజ్ కలిగిన వ్యక్తి చంద్రబాబు. సెప్టెంబర్ 1వ తేదీకి ఆయన మొదటి సారి సీఎం అయి 30 ఏళ్ళు. తెలుగుజాతి చరిత్రలో యన్టీఆర్ ప్రస్తావన లేకుండా..

మిగతా.. 11లో

# స్మగ్లర్ గంగిరెడ్డికి 'రెడ్' కార్పెట్ వేసిందెవరు?

- బీజేపీలో గంగిరెడ్డి దంపతుల చేరిక వివాదం
- అసలు వారితో డీల్ చేసిన ఎవరా ఇద్దరు?
- ఢిల్లీవరకూ దాకా వెళ్లిన స్మగ్లర్ చేరిన యవ్వారం
- తాము బీజేపీలో చేరతామని మీడియాకు చెప్పిన గంగిరెడ్డి
- రాష్ట్ర నాయకత్వం అనుమతి లేకుండానే ఎలా చేరతారంటున్న సీనియర్లు
- సమన్వయకర్త ఆ 'డాక్టరు'గారేనంటున్న బీజేపీ సీనియర్లు
- ఢిల్లీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- నేరుగా వారికే ట్వీట్ చేసిన వైనం
- కీలక నేత ఆగ్రహంతోనే ఆగిన స్మగ్లర్ చేరిక
- దానితో దిద్దుబాటుకు దిగిన రాష్ట్ర నాయకత్వం
- వైసీపీ రెడ్డి నేతలకు ఓ అగ్రనేత 'రెడ్డి'కార్పెట్



(మార్తి సుబ్రహ్మణ్యం)

అతను అప్పటి-ఇప్పటి సీఎం చంద్రబాబునాయుడుపై అలిపిరిలో నక్సల్స్ చేసిన దాడికి సహకరించిన వ్యక్తి. ఎర్రచందనం స్మగ్లర్ అన్నది ఆయనకున్న ఆరోపణలాంటి బిరుదు. మొన్నీ మధ్యనే ఆయనను పోలీసులు పిలిపించారట. అలాంటి వ్యక్తికి వైసీపీ ఎంపీ సీటు ఇచ్చిందని, కూటమి నేతలు విరుచుకుపడ్డారు. విచిత్రంగా అదే వ్యక్తి సతీసమేతంగా కమలవనంలో సేదదీరేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు కడప బీజేపీ పెద్దా 'రెడ్డి' గారు, రాజంపేటకు చెందిన ఓ కేంద్రమాజీ మంత్రి అల్లుడుగారు తెరవెనుక కథ నడిపారు. చాలాకాలం నుంచి పార్టీలో తెరవెనుక కీలకపాత్ర పోషిస్తున్న ఓ 'డాక్టరు'గారి సౌజన్యంతో.. సదరు స్మగ్లర్ దంపతులు కమలతీర్థం తీసుకునే కార్యక్రమం సిద్ధమయింది.

తాము బీజేపీలో చేరబోతున్నట్లు స్మగ్లర్‌గా ఆరోపణలున్న వ్యక్తి సైతం ఓ మీడియా ప్రతినిధికి సగర్వంగా చెప్పిన వైనం పత్రికలో వచ్చింది. అంతే.. కథ అడ్డం తిరిగింది. యవ్వారం ఢిల్లీ పెద్దల వరకూ వెళ్లింది. వాళ్లు విచారించుకున్నారు. "మనది చిన్న పార్టీ. అంతపెద్ద హోదా ఉన్న వాళ్లు మన పార్టీకి పనికిరారు. వారిని ఏదైనా అంతర్జాతీయ పార్టీలో చేరమనండి" అని సలహా ఇచ్చారట. దానితో చివరి నిమిషంలో కొల్లం గంగిరెడ్డి దంపతుల చేరికకు బ్రేకు పడింది.

మరి ఇదంతా రాష్ట్ర నాయకత్వానికి తెలియకుండానే జరిగిందా? ఎవరి గ్రీన్‌సిగ్నల్ లేకుండానే గంగిరెడ్డి తాను బీజేపీలో చేరుతున్నట్లు, మీడియాకు ఏ ధైర్యంతో ఎలా చెప్పారు? గంగిరెడ్డి పార్టీలో చేరడం లేదని పార్టీ నాయకులు మళ్లీ ఎందుకు ప్రకటించాల్సి వచ్చింది? గంగిరెడ్డి చేరిక వెనుక వైసీపీ కీలక నేత ప్రోత్సాహం ఉందా? ఇంకా ఇలాంటి వారిని ఎంతమందిని చేర్పించే వ్యూహానికి తెరలేచింది? అంతకు మించి.. అసలు పార్టీలో సభ్యత్వం లేకపోయినా, 'సదరు డాక్టరు గారు' పార్టీ వ్యవహారాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు? .. ఇదీ ఇప్పుడు బీజేపీ వర్గాలలో జరుగుతున్న వాడివేడి చర్చ.

ఎర్రచందనం స్మగ్లర్‌గా పేరున్న గంగిరెడ్డి.. తన భార్యతో పాటు బీజేపీలో చేరుతున్నారన్న వార్త, రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. కూటమి అధికారంలో ఉండగా.. సీఎం చంద్రబాబునాయుడుపై అలిపిరిలో నక్సల్స్ జరిపిన దాడికి సహకరించారన్న ఆరోపణలున్న గంగిరెడ్డిని, బీజేపీలో ఎలా చేర్చుకుంటారన్నదే ఆ విస్మయానికి కారణం. తాను భార్యతో సహా బీజేపీలో చేరుతున్నట్లు గంగిరెడ్డి స్వయంగా ఓ మీడియాకు వెల్లడించిన వార్త, బీజేపీని అతలాకుతలం చేసింది.

పార్టీ రాష్ట్ర నాయకత్వ అనుమతి ఇవ్వకపోతే, అసలు గంగిరెడ్డి అక్కడినుంచి విజయవాడ దాకా ఎందుకు వస్తారు? ఎలా వస్తారు? తన చేరిక విషయాన్ని మీడియాకు ఆయన ఏ ధైర్యంతో, ఎలా వెల్లడించగలిగారు? పైస్థాయిలో గ్రీన్‌సిగ్నల్ రానిదే గంగిరెడ్డి పార్టీలో ఎలా చేరతారన్న ప్రశ్నలు బీజేపీలో హాట్ టాపిక్‌గా మారాయి.

నిజానికి గంగిరెడ్డి తాను బీజేపీలో చేరుతున్నట్లు మీడియాకు వెల్లడించకపోతే, ఆయన చేరిక విజయవంతంగా జరిగిదే. కానీ మీడియాలో వచ్చిన తర్వాత ఉమ్మడి టీడీపీ జిల్లా నేతలు స్పందించి, బీజేపీ అగ్రనేతలకు ట్వీట్ చేయడం.. దానిపై ఢిల్లీ నాయకత్వం ఆరా తీయడం.. చేర్చుకోవద్దని ఆదేశించడం చకచకా జరిగిపోయాయి. తర్వాత గంగిరెడ్డి చేరికపై రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రకటన

మిగతా.. 2లో

- ఏపీని ముంచెత్తుతున్న భారీ వర్షాలు
- 8 మంది మృతి, డజన్ల మందికి గాయాలు
- నీటమునిగిన పంటపొలాలు
- విజయవాడలో నలుగురు, గుంటూరులో నలుగురు మృతి
- జలదిగ్బంధంలో విజయవాడ, గుంటూరు
- నీళ్లలో కొట్టుకుపోయిన కార్లు, టూ వీలర్లు
- కారు కొట్టుకుపోవడంతో టీచరు, విద్యార్థులు మృతి
- దుర్గ గుడిపై విరిగిపడుతున్న కొండచరియలు
- కొండపైకి రాకపోకలు బంద్
- గుంటూరు, కృష్ణాలో జలప్రళయం
- ఆ రెండు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్
- ఉదయం నుంచి సమీక్షలతో సీఎం చంద్రబాబు బిజీ
- మృతులకు 5 లక్షల నష్టపరిహారం
- తక్షణ సాయం కింద జిల్లాకు 3 కోట్లు విడుదల



# జనం బతుకు.. జల'హారతి'

(సుబ్బు)

జనం బతుకు జలహారతయిపోయింది. రాత్రి నుంచి కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు గుంటూరు, కృష్ణా జిల్లాలు భారీగా దెబ్బతిన్నాయి. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం వివిధ ఘటనల్లో 8 మంది మృతి చెందగా, డజన్ల సంఖ్యలో గాయపడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాష్ట్ర రాజధాని నగరం విజయవాడ, రాజధాని జిల్లా అయిన గుంటూరు నగరం వానకు తడిసి ముద్దయింది. విజయవాడ క్రీస్తురాజపురంలో కొండచరియలు విరిగిపడటంతో నలుగురు మృతి చెందగా, గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మరో నలుగురు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మంగళగిరి, వినుకొండతో పాటు గుంటూరు నగరం భారీగా నష్టపోయింది. ప్రధానంగా పంటపొలాలు నీటమునిగాయి. జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. భారీ వాహనాలు సైతం కాల్వల్లో కొటుకు పోయాయి. వీటికి

మిగతా.. 2లో


# సహాయక చర్యల్లో అలసత్వం వద్దు

- భారీ వర్షాలు... యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- ఓర్వకల్లు పర్యటన రద్దు
- సీఎస్, డీజీపీ, మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్
- వరద సహాయ చర్యలకు జిల్లాకు రూ.3 కోట్లు
- తక్కువ ప్రభావం ఉంటే రూ.2 కోట్లు
- తక్షణం విడుదలకు సీఎం ఆదేశం
- భారీ వర్షాలు ఉన్న జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ఇవ్వండి
- కొండచరియల బాధిత కుటుంబాలను ఆదుకుంటాం:
- సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై శనివారం ఉదయం నుంచి నిరంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు, సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేస్తున్నారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా సీఎస్, డీజీపీ, మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీవోలు, డిఎస్పీలతో మాట్లాడి ఎప్పటి కప్పుడు పరిస్థితులను అంచనా వేస్తున్నారు. సహాయ చర్యలకు జిల్లాకు రూ.3 కోట్ల చొప్పున తక్షణం

మిగతా.. 11లో



తల్లితో కలసి శ్రీకృష్ణ మఠాన్ని దర్శించిన ఎన్టీఆర్

10లో



కొండచరియల బాధితులకు ఆర్థిక సాయం పంపిణీ

10లో



పిఠాపురంలో కమిషనర్, డీఈఈ ముష్టియుద్ధం!

7లో



రేవంత్ రెడ్డి ఫ్యామిలీకి ఒక రూల్.. పబ్లిక్‌కి ఒక రూలా?

3లో

# రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్

- గొడ్డు కారంతో పెడుతున్నారు
- పాములు కరిచి చనిపోతున్నారు
- ఎలుకలు కొరికి ఆసుపత్రుల పాలవుతున్నారు
- జనవరి నుండి మెస్ బిల్లులు ఇవ్వలేదు
- రంగారెడ్డి జిల్లా, పాలమాకుల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు




**పాలమాకుల,మహానాడు:** ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే ఎందుకు స్పందించరు? ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు? ప్రతిపక్షాల మీద విమర్శ చేయడం తప్ప

మిగతా.. 2లో

## వైసీపీ సోషల్‌మీడియా నేత ఇంటూరి రవికిరణ్ అరెస్ట్

- చంద్రబాబు-పవన్‌పై బూతులతో కామెంట్లు
- మార్ఫింగ్ ఫొటోలతో అనైతిక చర్యలు
- గతంలోనే ఇంటూరిపై ఫిర్యాదులు
- మిగిలిన వైసీపీ పేటీఎం బ్యాచ్‌కు దేహశుద్ధి
- ఫొటో మార్ఫింగ్ బ్యాచ్‌కు పోలీసుల దబిడి దిబిడి



**గుడివాడ,మహానాడు:** అత్యంత జుగుప్సాకరంగా ముఖ్య మంత్రి చంద్రబాబు- ఉప ముఖ్య మంత్రి పవన్ ఫోటోలు మార్ఫింగ్ చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడు తున్న, వైసీపీ కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌పై గుడివాడకు చెందిన అసిలేటి నిర్మల ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు

మిగతా.. 2లో

# ఏం ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు కేసీఆర్?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుంది, సంక్షేమ పథకాలు చేపడుతుంది అవి వద్దు అని చెప్పడానికి వస్తావా కేసీఆర్
- ఫ్యూడల్ గవర్నమెంట్ వద్దు.. పీపుల్స్ గవర్నమెంట్ కావాలని రాష్ట్ర ప్రజలంతా చెప్పాలి
- మిగులు విద్యుత్తు రాష్ట్రం గా పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలకు విద్యుత్తు విక్రయాలు చేపట్టి లాభాలు సాధిస్తాం
- తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తాం
- రుణమాఫీ చేస్తామని మీలాగా ఇళ్లల్లో పడుకోలేదు
- ప్రతిరోజు ప్రజలను కలుస్తున్నాం.. అర్హులైన వారందరికీ రైతు రుణమాఫీ అమలు చేస్తాం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజీవ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ - ప్రారంభిస్తాం.. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉచితంగా ఆన్లైన్లో శిక్షణ ఇప్పిస్తాం
- రామగుండం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

4లో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 01, సెప్టెంబర్ 2024



# స్మగ్లర్ గంగిరెడ్డికి 'రెడ్' కార్పెట్ వేసిందెవరు?

(మొదటిపేజీ తరువాయి..)

విడుదల చేయటం.. గంగిరెడ్డి పార్టీలో చేరుతున్నారని నేను ప్రకటించానా? ఆయనేమైనా మీకు చెప్పాడా? మా జిల్లా పార్టీ నేతలు మీకు చెప్పారా? అంటూ మీడియాను ప్రశ్నించడం జరిగిపోయింది. అయితే.. పార్టీలో చేరికకు అగ్రనేతల గ్రీన్ సిగ్నల్ లేకుండానే, గంగిరెడ్డి తన పార్టీ చేరికను మీడియాకు ఎలా ప్రకటించారన్నది ప్రశ్న.

కాగా ఉమ్మడి-విభజిత కడప జిల్లాలకు చెందిన ఇద్దరు అగ్రనేతలే.. గంగిరెడ్డి దంపతులను పార్టీలో చేర్పించేందుకు కృషి చేశారన్న చర్చ బీజేపీ వర్గాల్లో జరుగుతోంది. అందులో ఒకరు జిల్లా స్థాయి నేత కాగా, మరొకరు మాజీ కేంద్రమంత్రి బంధువని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గంగిరెడ్డి పార్టీలో చేరితే ఉమ్మడి కడప జిల్లాలో పార్టీ బలపడుతుందని, ఆర్థికంగా పార్టీకి సహకరిస్తారన్న వాదనతో వారిద్దరూ.. ఆర్థిక వ్యవహారాల్లో నిష్ణాతుడైన, పార్టీకి ఏమాత్రం సంబంధం లేని ఒక డాక్టరు గారిని సంప్రదించారన్న వార్తలు గుప్పుమంటున్నాయి.

చాలాకాలం నుంచి వివిధ అంశాల్లో తెరవెనుక నుంచి చక్రం తిప్పుతున్న ఆ డాక్టరుగారు.. ఇటీవలి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికైనా కీలకపాత్ర పోషించారన్న ప్రచారం, పార్టీ వర్గాల్లో అప్పట్లోనే జరిగిన విషయం తెలిసింది. ప్రధానంగా మద్యం తయారీ- అమ్మకాల వ్యవహారాలు, కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజంపేట ఎంపీ సీటు అంశం, రఘురామకృష్ణంరాజుకు నర్సాపురం సీటు రాకుండా అడ్డుపడటంలో సదరు డాక్టరుగారే తెరవెనుక చక్రం తిప్పారన్న ప్రచారం జరిగింది.

రాజంపేటలో మిథున్‌రెడ్డి గెలుపుతోపాటు.. సుజనాచౌదరి, సత్యకుమార్, సీఎం రమేష్, రఘురామకృష్ణంరాజుకు ఎంపీ టికెట్లు రాకుండా, చివరి వరకూ కృషి చేసిన సదరు డాక్టరు గారే.. ఇప్పుడు గంగిరెడ్డి దంపతుల చేరిక వెనుక సైతం కీలకపాత్ర పోషించారని, అది ఢి ల్లీ పెద్దలకు తెలియడంతో వ్యూహం దెబ్బతిందని పార్టీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది.

దీనితో వైసీపీ నుంచి, ఇంకా ఎంతమందిని బీజేపీలో చేర్పించేందుకు రంగం సిద్ధం చేశారోనన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఇటీవల పార్టీ జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌జీ.. ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలను చేర్చుకోవాలని సూచించారు.

అయితే అది టీడీపీ-జనసేనకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, వివాదాస్పదులు, క్రిమినల్ కేసులు, ఆరోపణలున్న వారిని చేర్చుకోవద్దని స్పష్టం చేశారు. పెద్ద నేతలుంటే వారిని చేర్చుకునేముందు, తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఈ నేపథ్యంలో టీడీపీ-జనసేనలో ప్రవేశం లేని వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో దాదాపు అంతా ఆర్థికంగా బలవంతులే కావడంతో, వారిని చేర్చుకోవడం ద్వారా 'రెండురకాల లాభాలు'ంటాయన్న వ్యూహంతో.. వారి చేరికలను కొందరు ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా వైసీపీలోని రెడ్డి నేతలను చేర్చుకునేందుకు, పార్టీలోని అదే సామాజికవర్గానికి చెందిన ఓ కీలకనేత ఆసక్తిగా ఉన్నారని చెబుతున్నారు.

'గతంలో వెంక య్యగారున్నప్పుడు పార్టీలో ఉన్నప్పుడు కమ్మ ముద్ర ఉండేది. ఇప్పుడు ఈయన వచ్చిన ఐదేళ్ల నుంచి రెడ్డిముద్ర పడింది. సిద్ధాంతాల ప్రాతిపదిక నడిచే మా పార్టీపై ఇలాంటి కులముద్రపడటం బాధాకరం' అని ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు.

# వైసీపీ సోషల్‌మీడియా నేత ఇంటూరి రవికిరణ్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి..)

చేశారు. ఈ కేసును గుడివాడ 1 టౌన్ పోలీసులు, ఇంటూరి రవికిరణ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇంటూరి అరెస్ట్, వైకాపా గుడ్లవల్లి పుకార్ల ప్రచారం సమయం అనేది కాకతాళీయం.

ట్విట్టర్‌లో అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేసి, స్పేస్‌లో మహిళలను బూతులు తిడుతూ కామెంట్లు పెడుతున్న వైసీపీ సోషల్‌మీడియా అల్లరి బ్యాచ్‌కు పోలీసులు దేహశుద్ధి చేశారు. శ్రీనాథ్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, హరిరెడ్డి, దిల్లీరెడ్డి, గంగిరెడ్డి, రాహుల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి అనే యువకులు గత కొన్నేళ్ల నుంచి టీడీపీ, ఇతర మహిళా నేతలను లక్ష్యంగా చేసుకుని, ట్విట్టర్‌లో వారి ఫొటోలు మార్ఫింగ్ చేసి, వేధిస్తున్నారు. ప్రభుత్వం మార డంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు ఈ అరాచకశక్తులను గుర్తించి దేహశుద్ధి చేస్తుంటే, ఇకపై అలాంటి పనులు చేయ మంటూ కాళ్లమీదపడుతున్న వీడియో ఇది. సోషల్‌మీడియాలో ఈ వీడియో తెగ హల్‌చల్ చేస్తోంది.




# జనం బతుకు.. జల'హారతి'

(మొదటిపేజీ తరువాయి..)

సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరో రెండురోజుల పాటు భారీ వర్షాల గండం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

కాగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు ఉదయం నుంచి సమీక్షలతో అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. డీజీపీ, సీఎస్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిరంతరం సమీక్షలు చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీకి అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో, మరో మూడురోజుల సమయం ఇచ్చారు. తక్షణ సాయం కింద జిల్లాకు 3 కోట్లు విడుదల చేశారు.

భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో 8 మంది చనిపోయినట్టు అధికారులు వివరించారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో అత్యధికంగా 21.95 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లా తెనాలిలో 17.8, మంగళగిరిలో 15.4, ఏలూరు జిల్లా నూజివీడులో 15, బాపట్ల జిల్లాలో 11, పల్నాడు జిల్లాలో 10, కృష్ణా జిల్లాలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### కృష్ణా,గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా,గుంటూరు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అకస్మాత్తుగా వరదలు ముంచెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ప్రధాన పోర్టుల్లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

### మొగల్రాజపురంలో నలుగురు మృతి

విజయవాడలోని మొగల్రాజపురంలో ఇళ్లపై కొండచరియలు విరిగిపడటంతో నలుగురు మృతి చెందారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ఏపీ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

### జలదిగ్బంధంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి

జలదిగ్బంధంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో పలు ప్రాంతాలు నీటమునిగాయి. బస్టాండ్ సమీపంలో బ్రిడ్జి వద్ద రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పలు బస్సులు, లారీ లు, కార్లు గోతుల్లో దిగబడి ఇరుక్కుపోయిన పరిస్థితి. వన్‌టౌన్ పితాని అప్పలస్వామి స్ట్రీట్ వద్ద సపోర్ట్ గోడ మెట్లు కూలడంతో రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇంట్లో ఉన్న వారు బయటకి రావడంతో ప్రమాదం తప్పినట్లైంది.

డ్రైనేజీ నీరు ఇంట్లోకి రావడంతో రాత్రి నుంచి చిన్న పిల్లలు, మహిళలతో జాగారాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

### చాలా చోట్ల రోడ్లపై మోకాలి లోతు నీరు

విద్యాధరపురం, ఆర్ఆర్ నగర్, విజయవాడ సెంట్రల్ బస్‌స్టాండ్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతో ట్రాఫిక్ కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

రామవరప్పాడు రింగ్ రోడ్ నుంచి నిడమానూరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. చాలా చోట్ల రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచింది. ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద బస్సులు నీటిలో ముందుకు కదల్లేక నిలిచిపోయాయి.

ఇంద్రకీలాద్రిపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో దేవస్థానానికి చెందిన సమాచార కేంద్రం ధ్వంసమైంది. పెద్ద బండరాళ్లు, ఒక్కసారిగా జారిపడడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

### కాల్వలకు 3,507 క్యూసెక్కులు విడుదల

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీకి 3.24లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మొత్తం 70 గేట్లు ఎత్తి 3.2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి కాల్వలకు 3,507 క్యూసెక్కులు విడుదల చేశారు.

### కాజ టోల్ గేట్ వద్ద నీరు

మంగళగిరి సమీపంలోని కాజ టోల్ గేట్ వద్ద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇక్కడ భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దాంతో, సిబ్బంది టోల్ గేట్ వద్ద ఎలాంటి ఫీజు వసూలు చేయకుండానే వాహనాలను పంపించి వేస్తున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో, పలు వాహనాలను సిబ్బంది వెనక్కి పంపిస్తున్నారు. రోడ్లపైకి ఎవరూ రావొద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. వరద ప్రవాహం ధాటికి వాహనాలు సైతం కొట్టుకుపోయే పరిస్థితి ఉందని స్పష్టం చేశారు.

### జిల్లాకు రూ.3 కోట్ల చొప్పున తక్షణ సాయం:చంద్రబాబు

వర్షాలపై మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'మరో మూడు రోజులు వర్షం ప్రభావం ఉండనుంది. అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగాన్ని ఆదేశించా. భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించొచ్చు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి అని' అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సహాయ చర్యల కోసం జిల్లాకు రూ.3 కోట్ల చొప్పున తక్షణ సాయం అందిస్తున్నట్టు ప్రకటించారు.

### ఉప్పలపాడు వాగులో కారు కొట్టుకుపోయింది..

గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం ఉప్పలపాడు సమీపంలోని వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై వివరాల ప్రకారం.. నంబూరులోని ఓ పాఠశాలలో ఉప్పలపాడుకు చెందిన రాఘవేంద్ర విధులు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం సెలవు ప్రకటించింది.

పాఠశాలకు వచ్చిన ఉప్పలపాడుకు చెందిన ఇద్దరు విద్యార్థులను తీసుకొని రాఘవేంద్ర స్వగ్రామానికి బయల్దేరాడు. దారి మధ్యలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నా ఆగకుండా వెళ్లడంతో వరద ఉద్ధృతికి కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో రాఘవేంద్రతోపాటు కారులో ఉన్న విద్యార్థులు సాత్విక్, మానిక్‌లు మృతిచెందారు. స్థానికుల సాయంతో కారుతో పాటు వాగులో కొట్టుకుపోయిన మృతదేహాలను బయటకు తీశారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

గుంటూరు జిల్లా వినుకొండలో శనివారం ఉదయం నుండి ఎడతెరిపికొండ భారీ వర్షం కురుస్తుంది. వినుకొండ నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు కొన్ని కారుతున్నాయి. బస్సు పై బాడీకి చిల్లులు పడటం, తుప్పుపట్టి అతుకులు పోవడంతో వర్షానికి బస్సు అంతా కారుతుంది. దీంతో ప్రయాణికులు తడిసి ముద్దయి ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణికులు వెంట తెచ్చుకున్న గొడుగులు బస్సుల్లో వేసుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మంగళగిరి టిడ్కో కాలనీలోకి నీళ్లు

రాత్రి నుంచి మంగళగిరిలో కురిసిన భారీ వర్షాలకు టిడ్కో కాలనీలోకి నీళ్లు వచ్చాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి కూడా కాలువలు నిండిపోయి బ్లాకులు వద్దకు మురుగునీరు రావటంతో పలు ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న టిడ్కో కాలనీవాసులు. గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలు దెబ్బకు బ్లాక్ లోకి నీరు చేరడంతో పాటు విష పురుగులు కూడా తిరుగుతూ కనిపించడంతో ఆందోళన చెందుతున్న కాలనీవాసులు. అధికారులు వెంటనే నీరు త్వరగా బయటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్న టిడ్కో కాలనీ ప్రజలు కోరుతున్నారు.

### 25 ప్యాసింజర్ రైళ్ల రద్దు

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో విజయవాడ డివిజన్ పరిధిలో 25 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. వీటిల్లో విజయవాడ నుండి తెనాలి, గూడూరు, కాకినాడ పోర్టు, రేపల్లె, మచిలీపట్నం, గుడివాడ, నిడదవోలు, భీమవరం, గుంటూరు, నరసాపూర్, ఒంగోలు వెళ్లే రైళ్లున్నాయి. ఇవి కాకుండా గుంటూరు రేపల్లె, తెనాలి రేపల్లె, గుడివాడ, మచిలీపట్నం మధ్య నడిచే రైళ్లను 31, 1, 2 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లిలో తొలిసారి రైలు పట్టాలపైకి వర్షపునీరు వచ్చి చేరింది. భారీగా నీరుపారడంతో పట్టాలు కొట్టుకుపోయాయి. దీంతో రైళ్లను ఎక్కడికక్కడ నిలిపేశారు. వీలైనంత త్వరగా రైళ్ల రాకపోకలు పునరుద్ధరిస్తామని డిఆర్ఎం తెలిపారు.

# రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్

(మొదటిపేజీ తరువాయి..)

పాలన మీద దృష్టి లేదు. చీమ కుట్టినట్లు అయినా మీకు లేదు. సిగ్గుచేటు. గురుకులాల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోయే పరిస్థితి. ప్రభుత్వం మీద నమ్మకం కొద్ది గురుకులాల్లో జాయిన్ చేస్తే ఏం చేస్తున్నారు?


రేవంత్ రెడ్డి ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్. నువ్వు పూర్తిగా విఫలం అయ్యావు. పిల్లలు రోడ్డు మీదకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తుంటే బాధ తెల్సుకోవాలని వచ్చాను. దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నారు. భయంతో వణికిపోతున్నారు. కర్రలు విరిగేలా కొడుతున్నారని ఏడుస్తున్నారు. అన్నంలో, పప్పులో పురుగులు అంటే తినేసి తినండి అంటున్నారు అని బాధపడుతున్నారు. ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారు. రెండో జత ఇవ్వలేదు అంటున్నారు. పుస్తకాలు కూడా ఇవ్వని పరిస్థితి.

కేసీఆర్ సన్నబియ్యం తో అన్నం పెడితే మీరు గొడ్డు కారంతో పెడుతున్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం. 500 మంది ఆసుపత్రుల పాలయ్యారు. 38 మంది చనిపోయారు పాములు కరిచి చనిపోతున్నారు. ఎలుకలు కొరికి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఒకప్పుడు గురుకులాల్లో చదవటం కల. ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు.

కించపరిచేలా మాట్లాడటం సరికాదు. ఇక్కడ ఉన్న టీచర్లను మార్చండి. మంచి భోజనం పెట్టండి అని డిమాండ్ చేస్తున్నం. ముఖ్యమంత్రి విద్యా శాఖా మంత్రి గా ఉన్నారు. మైనార్టీ గురుకులాలు జనవరి నుండి మెస్ బిల్లులు ఇవ్వలేదు.అన్ని గురుకులాల్లో కాస్మొటిక్ చార్జెస్, కరెంటు బిల్లులు, మెస్ బిల్లులు రావడం లేదు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి తక్షణం చర్యలు తీసుకోండి.

సన్న బియ్యం కాదు పురుగుల అన్నం పెడుతున్నరు.



తక్షణమే స్పందించి చర్యలు తీసుకోండి. మా నెంబర్ కూడా పిల్లలకి ఇచ్చాం. వారు భయపడి పోతున్నారు. ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు.

### గురుకులాలను గాలికి వదిలేశారు: మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి

గురుకులాలను గాలికి వదిలేశారు. విద్యా శాఖను పట్టించుకోవడం లేదు. ఎవరు ఏం అడిగిన పట్టించుకునే వారు లేరు. సీఎం గారు ఎందుకు దృష్టి పెట్టడం లేదు? సమీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదు? అసెంబ్లీలో అడిగినా సమాధానం లేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.







జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 01, సెప్టెంబర్ 2024

## వరద ప్రాంతాల్లో టీడీపీ నేతలు

# సహాయక చర్యలు చేపట్టాలి

◆ మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం, మహానాడు:

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సూచించారు. ప్రభుత్వం, విపత్తు నిర్వహణ శాఖ అలెర్ట్ మెసేజ్‌లు గమనిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు బయటకు రాకుండా ఉండటమే మంచిది. కొండ చరియలు విరిగిపడే, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికార యంత్రాంగం సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు సహాయక చర్యలకు తమ పూర్తి సహకారం అందించాలి. విపత్తుల కష్ట సమయంలో



తెలుగుదేశం పార్టీ ప్రజలకు అండగా ఉంటుందనే భరోసా కల్పించాలి.

# కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే ప్రమాదం

◆ లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం
◆ కొన్ని చోట్ల చెరువులకు స్థానికులు గండ్లు పెట్టే అవకాశం
◆ ప్రాణ, ఆస్తి నష్టం కలుగ కుండా జాగ్రత్తలు
◆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్, ఆగస్టు 31,మహానాడు:


రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినందున ఏ విధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేడు జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ డా. జితేందర్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, మున్సిపల్ పరిపాలన విభాగం సంచాలకులు గౌతమ్ లు కూడా ఈ టెలీ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, తెలంగాణా తో పాటు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలోను భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఏ విధమైన ఆకస్మిక విపత్తు ఎదురైనా వాటిని సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. ప్రతీ జిల్లా కలెక్టర్ కార్యాలయం తోపాటు జీహెచ్ఎంసీ, రాష్ట్ర సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్ లను తెరవాలని తెలిపారు.

లోతట్టు, వరద ప్రాంతాల నుండి ప్రజలు వెళ్లకుండా తగు నిఘా పెట్టాలని అన్నారు. ముఖ్యంగా ఉధృతంగా పారే వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాల దృష్ట్యా జిల్లాల్లో పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించుకునే నిర్ణయం జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని సి.ఎస్ స్పష్టం చేశారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాలనుండి ప్రజలను తరలించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసే విషయంలో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

భారీ వర్షాలు, వరదల వల్ల తీసుకునే జాగ్రత్తలపై ప్రజలను ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా చైతన్య



పరచాలని అన్నారు. గ్రామాలు, పట్టణాలలోని మంచి నీటి వనరులైన ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవడంతోపాటు, అంటూ వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు. వైద్య బృందాలను అప్రమత్తం చేశామని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగు మందులను సిద్ధంగా ఉంచామని సి.ఎస్ శాంతి కుమారి తెలిపారు.

ప్రస్తుతం NDRF బృందాలు హైదరాబాద్, విజయవాడ లలో ఉన్నాయని, ఏవిధమైన అవసరం ఉన్నా ముందస్తు సమాచారం ఇస్తే ఈ NDRF బృదాలను పంపించగలమని తెలియచేసారు. గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతాల్లోని జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వరదలు, వర్షాల వల్ల కొన్ని చోట్ల చెరువులకు స్థానికులు గండ్లు పెట్టే అవకాశం ఉందని, దీనివల్ల లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఈ విధమైన చర్యలను పాల్పడకుండా నీటిపారుదల శాఖ అధికారులచే పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో పోలీస్, నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, పంచాయితీ రాజ్ తదితర శాఖలతో కలసి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ లో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు, మాన్ హెూల్ లను తెరవకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు.

డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయాలు, ఎస్.పీలను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రధానంగా జిల్లా కలెక్టర్లతో సమన్వయంతో పనిచేయాలని, అన్ని కమిషనరేట్, ఎస్.పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు వెల్లడించారు.





# ప్రతి పేదకూ 'ఎన్టీఆర్ భరోసా'

◆ హామీకి కట్టుబడి తొలి నెల నుండే రూ.4వేల పెన్షన్
◆ మచిలీపట్నంలో సాయంత్రానికి 100 శాతం పంపిణీ పూర్తి
◆ పెన్షన్ల పంపిణీపై సచివాలయ సిబ్బంది చొరవ అభినందనీయం
◆ నిండు గర్భిణిగా ఉండీ పెన్షన్లు పంపిణీ హర్షణీయం
◆ భారీ వర్షంలోనూ పంపిణీ చేపట్టిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం, మహానాడు:

పేదలకు ఆర్థికంగా భరోసా కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నడచుకుంటోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం లోని గిలకలదిండి, బుద్దాలపాలెం గ్రామాల్లోని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. భారీ వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు పెన్షన్లు అందించారు. ఆయా కుటుంబాల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారుల ఆర్ధిక స్థితిగతులు, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. పేదరికాన్ని అరికడతామన్న మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకే ఆర్థిక కష్టాలున్నా, ఇబ్బందులు ఎదురైనా.. హామీ మేరకు తొలి నెల నుండే పెన్షన్లు రూ. 4 వేలకు పెంచామన్నారు.

### పెన్షన్ల చరిత్ర తెలుగుదేశానిదే...

పెన్షన్లను ప్రారంభించిందే తెలుగుదేశం ప్రభుత్వమని, ఎన్టీఆర్ రూ.30తో పెన్షన్లు ప్రారంభిస్తే.. చంద్రబాబు రూ.75 చేశాని మంత్రి అన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ముక్కీ మూలిగీ రూ.200 చేస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.2000 చేశారు. రూ.3000 చేస్తానని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక విడతల వారీ పెంపు పేరుతో పెన్షన్ దారుల్ని దగా చేశారు. ఏటా పెంపు మాటపై కూడా నిలబడకుండా మోసం చేశారు. ఒక్కో లబ్దిదారుడికి ఏకంగా రూ.40 వేల వరకు ఎగనామం పెట్టారు. కానీ, చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే హామీ మేరకు రూ.4 వేలకు పెంచడమే కాకుండా ఏప్రిల్ నుండే పెంపు అమలు చేశారు. పేదల పక్షాన నిలిచే నాయకుడు కాబట్టే పేదల కష్టాలు గుర్తించారన్నారు.

### తొలిరోజే 100 శాతం పంపిణీ చేస్తాం

పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న వారు, వితంతువులు, దివ్యాంగులు, కుల వృత్తులు చేసుకునే వారికి పెన్షన్లను ప్రారంభించింది కూడా చంద్రబాబేనని మంత్రి రవీంద్ర అన్నారు. ఇప్పుడు కూడా ఒకటో తేదీ ఆదివారం రావడంతో.. ఒక రోజు ముందుగానే పెన్షన్లు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గతంలో పదో తేదీ వరకు పెన్షన్లు పంపిణీ చేసేవారని, కానీ మేం ప్రజల గురించి ఆలోచించి.. ఒకే రోజు 100 శాతం పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చేసేందుకే ముందు రోజు పంపిణీ ప్రారంభించామని తెలిపారు.

### ఉద్యోగుల చొరవ అభినందనీయం

పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగుల చొరవ అభినందనీయమని తెలిపారు. భారీ వర్షంలో కూడా ఉద్యోగులు ఉదయాన్నే పంపిణీలోకి రావడం సంతోషంగా ఉంది. నిండు గర్భిణిగా ఉన్నప్పటికీ.. ఒక ఉద్యోగి తెల్లవారు జామునే పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం హర్షణీయం అన్నారు. ఆమె చిత్తశుద్ధికి మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

### పెన్షన్ దారుల హర్షం

పెన్షన్ల పెంపు, ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయడం పట్ల పెన్షన్ దారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సొమ్మును డ్వాక్రాలో పొదుపు చేసుకుంటూ భవిష్యత్తుకు వినియోగించుకుంటున్నట్టు వితంతువు హర్షం వ్యక్తం చేశారు. బుట్టలతో చేపలు అమ్ముకుంటున్నానని, పెన్షన్ సొమ్ము పెట్టుబడిగా ఉపయోగపడుతోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెన్షన్ సొమ్మును పెంచడంతో మందులు, వైద్య ఖర్చులకు ఇబ్బందులు తొలగిపోయాయని పలువురు వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. దివ్యాంగుల పెన్షన్ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచడంపై పలువురు దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా అందిన పెన్షన్ మొత్తంతో వైద్యానికి, ఇతర ఖర్చులకు ఆటంకాలు తొలగిపోయాయని దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో పెన్షన్ సొమ్ములో కొంత మొత్తం వాలంటీర్లు తీసుకునే వారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేక పోవడం పట్ల పలువురు పెన్షన్ దారులు సంతోషం వ్యక్తం చేశారు.

# రేవంత్ రెడ్డి ఫ్యామిలీకి ఒక రూల్.. పబ్లిక్‌కి ఒక రూలా?

◆ డబ్బులు ఢిల్లీకి.. అభివృద్ధి అమరావతికి
◆ రెమ్యునరేషన్ రేవంత్ రెడ్డికి.. తెడ్డు తెలంగాణకు
◆ ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం,రేవంత్ రెడ్డి లక్ష్యం
◆ హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటి? మంత్రివర్గ ఆమోదం ఉందా?
◆ బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

హైదరాబాద్,

హైడ్రాతో హైడ్రామా క్రియేట్ చేసి హైలెవల్ కమిషన్ లు దండుకోవడమే రేవంత్ రెడ్డి లక్ష్యం. డబ్బులు ఢిల్లీకి.. అభివృద్ధి అమరావతికి. రెమ్యునరేషన్ రేవంత్ రెడ్డికి.. తెడ్డు తెలంగాణ కు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం,రేవంత్ రెడ్డి లక్ష్యం. హైదారాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తియ్యాలని రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడు.

ఆకస్మిక,అనాలోచిత కూల్చివేతలతో భయభ్రాంతులకు గురిచేసి రియల్ ఎస్టేట్‌ను కుదేలు చేసి,పెట్టుబడులను అమరావతికి మళ్లించడమే రేవంత్ రెడ్డి లక్ష్యం. పేద ప్రజల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. పేదల ఇల్లు కూల్చాలని ఏ చట్టం చెప్పింది? హైడ్రా కు ఉన్న చట్టబద్ధత ఏమిటి? మంత్రివర్గ ఆమోదం ఉందా? ప్రతిపక్షాలను, ప్రజా అభిప్రాయం తీసుకున్నారా? కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వమే పర్మిషన్ లు ఇచ్చి ఇప్పుడు అదే కాంగ్రెస్ కూల్చివేస్తుంది.

వరంగల్ నగరంలో పేదల ఇళ్ళ జోలికి వస్తే సహించం, అక్రమ కట్టడాలు,కబ్జా స్థలాలు రికవరి చెయ్యండి కానీ పేదల గూడు చెదరగొట్టొద్దు. హైడ్రా కు మేం వ్యతిరేకం కాదు హైడ్రాతో చేస్తున్న హైడ్రామాకు పేదల ఇళ్ళు కూల్చడానికి మేం వ్యతిరేకం. పేదల ఇళ్లను రాత్రికి రాత్రే కూలుస్తూ తమ సోదరుడికి, ఇతర బడాబాబులకు మాత్రం ముందస్తు నోటీసులు ఇస్తారా?

హైడ్రా కు మనిషికోరూల్ ఉంటుందా? హైడ్రా కు బడా బాబులకు ఒక రూలు బక్కచిక్కిన ప్రజలకు ఇంకో రూలా?

రేవంత్ రెడ్డి ఫ్యామిలీ ఒక రూల్ పబ్లిక్‌కి ఒక రూలా? పేద ప్రజల ఇల్లు నోటీసులు ఇవ్వకుండా కూల్చి, రేవంత్ రెడ్డి తమ్ముడికి మాత్రం నోటీసులు ఇచ్చి ఎందుకు కాలయాపన చేస్తున్నారు?

జులైలో ఏర్పాటైన హైడ్రా నెల రోజుల్లోనే తెలంగాణలో, హైద్రాబాద్ లో ఉన్న చెరువులను కుంటలను, ఆక్రమణలను సర్వే చేసిందా!? హైడ్రాకి ఎటువంటి శాస్త్రీయమైన



అధ్యయనం లేదు. అసెంబ్లీలో చర్చ లేదు. కేబినెట్ లో చర్చ లేకుండా కేవలం సంచలనం కోసం,బెదిరింపులకు గురి చెయ్యడానికి రాత్రికి రాత్రే పుట్టిన హైడ్రాను వాడుకుంటున్నారు.

10 నుండి 15 ఏళ్లు టీడీపీ మినహాయిస్తే, 50 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే పాలించింది. ఈ నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణం కాదా? ఒక ఐఏఎస్ పర్మిషన్ లు ఇస్తారు. ఇంకో ఐపీఎస్ వచ్చి కూలుస్తారా? ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో బడా బాబులే కదా అని అందరూ అనుకున్నారు. తర్వాత మెల్లిమెల్లిగా పేద ప్రజల ఇళ్ళమీదికి రేవంత్ రెడ్డి బుల్డోజర్లూసుకెళ్తున్నాయి.

ఇళ్ళు కూల్చిన పేదలకు తక్షణమే ప్రభుత్వం ఇల్లు కట్టించాలి.నష్ట పరిహారం ఇవ్వాలి. పేద ప్రజలు నివసిస్తున్న అస్మత్ పేట, అల్వాల్, సరూర్ నగర్, బోయిన్ బల్లి, రాజీవ్ నగర్, ఖాజాగూడ లో పేదల ఇళ్లకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వమే అనుమతి ఇచ్చి ఇంటిపన్ను,నల్లా పన్ను, కరెంట్ బిల్లులు తీసుకొని ఇన్నాళ్లు నివాసం ఉండటానికి పర్మిషన్ ఇచ్చి ఇప్పుడు ఆకస్మికంగా కూల్చివేయడం దేనికి సంకేతం.

పట్టా భూముల్లో నిర్మాణాలకు రక్షణ లేకపోతే ఇంకా రాష్ట్రంలో ఎవరికి రక్షణ ఉంటది? నగరాల్లో స్లమ్స్‌లో నివసించే ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏ కంపెనీ కింద ఏ నాలా ఉందో,ఏ చెరువు ఉందో తెలియక సాఫ్ట్ వేర్ రంగం బిక్కుబిక్కుమంటూ గడుపుతుంది. సాఫ్ట్ వేర్ రంగం లో కూడా చర్చ మొదలైంది.సుమారు30 లక్షల మంది సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఉన్నారు. పెట్టుబడులు అమరావతికి వెళ్ళిపోయే ప్రమాదం ఉంది

కాంగ్రెస్ వచ్చాక రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయింది. ప్రభుత్వ ఖజానాకు రూపాయి రావడం లేదు. రేవంత్ రెడ్డి గద్దెనెక్కిన నాటి నుండి రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయింది. కట్టిన ఇల్లు, ఫ్లాట్ల బుకింగ్‌లు నిలిచి పోయాయి. ఇప్పుడు హైడ్రా పేరుతో హైడ్రామా క్రియేట్ చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హైదారాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతిననీయం.

పట్టా భూముల్లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలు ఇళ్ళ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చి ప్రభుత్వం రాత్రికి రాత్రే కూల్చేయడానికి మించిన తుగ్లక్ చర్య వుంటుందా? కాంగ్రెస్ లో పి.జనార్ధన్ రెడ్డి లాంటి నాయకులు పేద ప్రజల ఇళ్ల పట్టాల కోసం,ఇళ్ల కోసం కృషి చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యాక ఇందిరమ్మ ఇళ్ళు కట్టించారు. కానీ రేవంత్ రెడ్డి ఇళ్ళు కూలగొడుతున్నారు.

ప్రజా సమస్యలను డైవర్ట్ చెయ్యడానికి,పెట్టుబడులు అమరావతికి తరలించడానికి కుట్ర చేస్తున్నారు. తక్షణమే హైడ్రా విధివిధానాలు రూపొందించాలి. 20,30 ఏళ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్ళు కూల్చివేతలు ఆపాలి. కూల్చి వేసిన ఇళ్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలి.



## సాగునీటి సౌకర్యాలపై 'గొట్టిపాటి' సమావేశం

దర్శి, మహానాడు:

దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దర్శి లోని వారి నివాసం వద్ద ఎన్ఎస్‌పీ అధికారులతో సమావేశం నిర్వహించారు. దర్శి నియోజకవర్గం లోని మొత్తం ఆయకట్టు ఎంత... రైతులకు త్వరలో సాగు నీటి అవసరాల కోసం అధికారులు తీసుకోవలసిన చర్యలు పైన చర్చించారు. అలాగే సాగర్ కాలువ నుండి చివరి భూములకు సాగునీరు చేరే విధంగా తీసుకోవలసిన చర్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌పీ డీఈ అక్బర్ భాషా, ఈఈ బొల్లేపల్లి పూర్ణ చంద్, తదితర అధికారులు ఉన్నారు.

## ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత

విజయవాడ, మహానాడు:

ప్రకాశం బ్యారేజీకి కృష్ణా నది వరద పోటెత్తింది. ప్రస్తుతం బ్యారేజీకి 3.24 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మొత్తం 70 గేట్లు ఎత్తి 3.2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి కాల్వలకు 3,507 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 01, సెప్టెంబర్ 2024

# వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత పర్యటన


- బాధితులకు నేనున్నానంటూ భరోసా

కొండపల్లి, మహానాడు:

వర్షాల వల్ల కొండపల్లి మున్సిపాలిటీలో డ్రైనేజీలు ఉధృతంగా మారాయి. ఒకవైపు వర్షం పడుతున్నప్పటికీ మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వరద ప్రాంతాల్లో శనివారం ఉదయం పర్యటించారు. నడుం లోతు నీటిలో పర్యటించి వరద బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులను, మహాకూటమి నాయకులను ఆదేశించారు. ఈ మేరకు మైలవరం నియోజకవర్గంలో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి తక్షణమే ఆహారం, మంచినీటి సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని, ఇంటిలోనే వుండే వారికి ఆహారాన్ని ప్యాకెట్లు రూపంలో అందించాలని, ప్రతి ఇంటికి మినిరల్ వాటర్ పంపిణీ చేయాలని ఆదేశించారు. మైలవరం నియోజకవర్గంలో వరద బీభత్స నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. వరద బీభత్సం తగు ముఖం పట్టే వరకు సహాయ చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండి వరద బాధితులకు విస్తృతంగా సేవలను అందించాలన్నారు. స్థానిక ఎన్డీఏ మహాకూటమి నాయకులు, అధికారులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# రూరల్ ఎంప్లాయిమెంట్‌తో పల్లెల అభివృద్ధి

- విద్యార్థులు గ్రామాల్లో రీసెర్చ్ చేయాలి
- ఐఎస్ఎఫ్ అంకుర యాత్ర ప్రారంభంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని






వడ్డేశ్వరం, మహానాడు:

కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు రూరల్ గ్రామాల్లోని రైతుల సమస్యలు, క్రిమి కీటకాల నివారణ వంటి అంశాలపై రీసెర్చ్ చేయాలి. వాటి ద్వారా రైతులకు ఉపయోగపడే ఆవిష్కరణలకు నాంది పలకాలి. ఇలా రూరల్ ఎంప్లాయిమెంట్ క్రియేట్ చేయగలితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌అన్నారు.

వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్(ఐఎస్ఎఫ్) వారి అంకుర యాత్ర ప్రారంభ కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టార్ట్ అప్ ఎకో సిస్టం ద్వారా దీర్ఘకాలంలో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, కాలిఫోర్నియా మాదిరిగా ఏపీలోనూ స్టార్టప్ లు తీసుకొచ్చేందుకు ఐఎస్ఎఫ్ ప్రయత్నం చేస్తోందని చెప్పారు.

## వ్యాపారానికి వయసుతో సంబంధం లేదు

వ్యాపార రంగంలో అడుగు పెట్టాలనుకునే వారికి వయసుతో సంబంధం లేదని, తాను విద్యార్థిగా ఉంటూనే వ్యాపార రంగంలోకి అడుగు పెట్టానని పెమ్మసాని వివరించారు. తొలుత 20-30 మంది విద్యార్థులకు బోధించానని, అమెరికా అంతటా తన మెటీరియల్ చదవాలనే లక్ష్యంతో పని చేశానని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కూడా ఇదే లక్ష్యంతో పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాలని సూచించారు. ఇతర దేశాల్లో అవలంభిస్తున్న పారిశ్రామిక విధానాలను కూడా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

## త్వరలో mygunturmp.in

ప్రజల కోసం త్వరలో mygunturmp.in పోర్టల్ ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ ప్రాజెక్టుల గురించి తెలియజేస్తే ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు కృషి చేస్తాం అని పెమ్మసాని అన్నారు. అనంతరం అంకుర యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ జేఏ చౌదరి, కేఎల్ వర్సిటీ చైర్మన్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ, ఐఎస్ఎఫ్ కో-ఫౌండర్లు దీనానంద్, సత్యేంద్ర, శివమహేష్, శ్రీకాంత్, కేజీఎంజీ మేనేజింగ్ పార్టనర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో తప్పిన వరద ముప్పు

- టీడీపీ 'దర్శి' ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మహానాడు:

భారీ వర్షాలతో కాలువలు వరద ఉధృతితో ప్రవహిస్తున్నా యని, వైసీపీ ప్రభుత్వం కాలువలను మరమ్మతు చేయకపోవ డంతో ఎక్కడికక్కడే మురికి నిలిచిపోయి, ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి లేదన్నారు. దర్శి పట్టణం, పొదిలి రోడ్డులోని ఆర్టీవో ఆఫీసు వాగు వద్ద డ్రైనేజీ వ్యవస్థను ఆమె శనివారం పరిశీలించారు.

వర్షాకాలం దృష్ట్యా ముందుగానే దర్శి నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులతో చర్చించి, గడియార స్తంభం వద్ద నుండి పొదిలి రోడ్డు, కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డులలో గల డ్రైనేజిలో పూడిక తీయించినట్టు తెలిపారు. ప్రస్తుత వర్షాల వల్ల ఈ ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు లేదన్నారు.

# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

- జిల్లా ప్రజలకు పెమ్మసాని సూచనలు

గుంటూరు, మహానాడు:

జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయని, ప్రజలు, జిల్లా యంత్రాంగం ప్రభుత్వాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, ఎలాంటి ప్రమాదాలు అధికారులు జరగకుండా చర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన పునరా వాసం కల్పించాలని సూచించారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటికి రాకుండా సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ, గుంటూరు జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ 9849904013, 0863-2234014 నంబర్లను సంప్రదించాలని పెమ్మసాని ఈ సందర్భంగా కోరారు.

**ముగ్గురు మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది..**


భారీ వర్షాలకు శనివారం గుంటూరు జిల్లా ఉప్పలపాడు గ్రామ శివారు వాగులో కారు ప్రమాదం ఘటనలో ముగ్గురు మృతి చెందిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గడిచిన మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు లోతట్టు ప్రాంతాలను కకావికలం చేస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో స్కూలు నుంచి ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో పాటు ఒక ఉపాధ్యాయుడు మరణించడం తీవ్రంగా కలిచి వేసిందని చెప్పారు. మృతులు పసుపులేటి సౌరిష్(7), కోడూరి మానవిత్ (9), నడుంపల్లి రాఘవేంద్ర(38)కు నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

# ఏం ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు కేసీఆర్?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుంది, సంక్షేమ పథకాలు చేపడుతుంది అవి వద్దు అని చెప్పడానికి వస్తావా కేసీఆర్
- ఫ్యూడల్ గవర్నమెంట్ వద్దు.. పీపుల్స్ గవర్నమెంట్ కావాలని రాష్ట్ర ప్రజలంతా చెప్పాలి
- మిగులు విద్యుత్తు రాష్ట్రం గా పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాలకు విద్యుత్తు విక్రయాలు చేపట్టి లాభాలు సాధిస్తాం
- తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉద్యోగాలు కల్పిస్తాం
- రుణమాఫీ చేస్తామని మీలాగా ఇళ్లల్లో పడుకోలేదు
- ప్రతిరోజు ప్రజలను కలుస్తున్నాం.. అర్హులైన వారందరికీ రైతు రుణమాఫీ అమలు చేస్తాం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజీవ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభిస్తాం.. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉచితంగా ఆన్లైన్లో శిక్షణ ఇప్పిస్తాం
- రామగుండం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు








రామగుండం,మహానాడు:

ఏం అడగడానికి.. ఏం చెప్పడానికి.. ఈ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తావు కెసిఆర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం పాల్గొని ప్రసంగించారు.

మీ 10 ఏళ్ల పాలనలో లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా గాలికి వదిలేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల వ్యవధిలోనే 18 వేల కోట్లు రైతుల కోసం బ్యాంకుల్లో జమ చేయడం తప్పు అని చెప్పడానికి వస్తావా కేసీఆర్ అని ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తానని మీరు ఇవ్వలేకపోయారు మేము ప్రతి నియోజకవర్గానికి 3500 మందికి తగ్గకుండా రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇల్లు నిర్మించేందుకు ముందుకు పోతున్నాం.. ఇందిరమ్మ ఇల్లు ఇస్తే బాగుండదని చెప్పడానికి వస్తావా కేసీఆర్ అని ప్రశ్నించారు.

పదేళ్ల పాలనలో ఉద్యోగాలు ఇవ్వలేకపోయాం.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడున్నర నెలలోనే 60 వేల ఉద్యోగాలు ఇస్తుంది.. ఇది తప్పు మాలాగా ఉద్యోగాలు ఇవ్వద్దు అని చెప్పడానికి వస్తావా కేసీఆర్ అన్నారు. దళితులకు మూడెకరాల భూమి అని చెప్పి ఎగనామం పెట్టిన కేసీఆర్ ఏం చెప్పడానికి ప్రజల్లోకి వస్తారని అన్నారు. కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రాలేదు.. ఏ సామాజిక, భావ స్వేచ్ఛ కోసం, సంపద అందరికీ పంచాలని తెలంగాణ తెచ్చుకుంటే అవేవీ కాకుండా సంపద మొత్తం దోపిడికి గురైంది అన్నారు.

కార్మికుల శ్రమను సైతం దోచుకున్న గత ప్రభుత్వాన్ని కూల్చాల్సిందేనని రామగుండం ప్రజలు పెద్ద ఎత్తున నా పాదయాత్రలో పాల్గొని అనేక సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ మొత్తం సమావేశమై నిర్ణయించిందన్నారు.. ఆర్థిక ఇబ్బందులు ఉన్న నెలల వ్యవధిలోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామన్నారు.మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ. సౌకర్యం కల్పించి ఆ మొత్తాన్ని ఇప్పటివరకు 2500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లించిందన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షల వరకు పెంచామని తెలిపారు. ఏ ఒక్క నిమిషం ఆలస్యమైనా ఏ మూలనో రోగి ఇబ్బంది పడతాడని భావించి ప్రమాణ స్వీకారం చేసిన అరగంటలోపే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచి అమలు చేశామన్నారు.

ప్రజా పాలన పేరిట సభలు పెట్టి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును మార్చి ఒకటి నుంచి అమలు చేస్తున్నామన్నారు. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తారో లేదో అని అంతా అనుమానపడ్డారు అర్హత కలిగిన అందరికీ 500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నాం.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పదేళ్ల పాలనలో విదేశాలకు వెళ్లి పెట్టుబడి తీసుకురాని కెసిఆర్ ఆయన కుమారుడు.. రాష్ట్ర సంపదను దోచుకుని విదేశాల్లో దాచుకున్నారని దుయ్యబట్టారు. మా సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబులు అమెరికా కొరియా దేశాల్లో పర్యటించి 36వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారని తెలిపారు.

బొగ్గు భాయి బొంబాయి అని మోసపు మాటలు చెప్పి గత పాలకులు నోటిఫికేషన్లు ఇవ్వలేదు. మేం మాత్రం దేశంలో ఎక్కడా లేనివిధంగా సింగరేణి కార్మికులకు కోటి రూపాయల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చాం. కాంటాక్ట్ కార్మికులకు 30 లక్షల బీమాను అమలు చేస్తున్నాం అన్నారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తూ మరోవైపు రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద 18 వేల కోట్లు జమ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ పొందలేని రైతులందరికీ రుణమాఫీని వర్తింపచేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. కెసిఆర్ మీలాగా మేం ఇళ్లల్లో పడుకోలేదు ప్రతిరోజు ప్రజలను కలుస్తున్నామన్నారు.

ఈ రాష్ట్ర ప్రజలకు ఆస్తులు సృష్టించి వ్యవస్థలు ఏర్పరిచి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. రామగుండం ప్రజల భావోద్వేగాలతో కూడుకున్న థర్మల్ పవర్ ప్లాంట్ ను 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తామన్నారు. జెన్కో ,సింగరేణి సంయుక్తంగా రామగుండంలో పవర్ ప్రాజెక్టు నిర్మించి ఉద్యోగాలు పోకుండా నిలబెట్టేందుకు ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తుంది అన్నారు.

రైతులు, యువత, సాగునీటి ప్రాజెక్టుల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో పట్టు ఉంది కదా అని అభాసుపాలు చేసేందుకు ప్రయత్నం చేస్తే ప్రజలు ఏమాత్రం ఉపేక్షించారన్నారు.

మీ కన్నా ఎక్కువ కరెంటు ఉత్పత్తి చేసాం. రేపు పాటు కూడా కరెంటు కోతలు లేకుండా ఉద్యోగులు శ్రమిస్తున్నారని తెలిపారు. పిక్ డిమాండ్ 15,600 మెగావాట్లను అందుకున్నామన్నారు. 2032 రెండు కల్లా రాష్ట్ర విద్యుత్తు అవసరాలు 27059 మెగావాట్లు అంచనా వేసి ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

థర్మల్ ప్రాజెక్టులు నిర్మిస్తాం, సోలార్, ఫ్లూటింగ్ అన్ని రకాల వనరులు వినియోగించి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఎదగడమే కాదు ఇతర రాష్ట్రాలకు విద్యుత్తును అమ్మి లాభాలు సాధిస్తాం. ఇక్కడ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించి యువతకు ఉపాధిని కల్పిస్తాం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పీఎం కుసుమ ప్రాజెక్టు కింద 4000 మెగావాట్ల సోలార్ విద్యుత్ను ఉత్పత్తి చేసేందుకు మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తాం అన్నారు. ప్రతి మహిళను మహారానిగా ఈ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. ఏటా 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందిస్తాం అన్నారు. మహిళల పక్షాన ఆ వడ్డీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది అన్నారు.

ప్రతి శాసనసభ నియోజకవర్గంలో రాజీవ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభిస్తాం అన్నారు. హైదరాబాద్ కు వెళ్లి పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకోలేని వారికోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో శిక్షణ కేంద్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. దేశంలోనే నిష్ణాతులైన లెక్చరర్లతో ఉచితంగా పోటీ పరీక్షలకు ఆన్లైన్లో శిక్షణ అన్నారు.

నాలుగు నుంచి ఐదు లక్షల మంది నిరుపేద విద్యార్థులు రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్నారని... వారికి గత ప్రభుత్వం మూడు కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి 5000 కోట్లు కేటాయించింది అన్నారు.రాష్ట్రంలో ఫ్యూడల్ గవర్నమెంట్ వద్దు పీపుల్స్ గవర్నమెంట్ ఉండాలి అని రాష్ట్ర ప్రజలందరూ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ట్రాన్స్ఫార్మర్ సబ్స్టేషన్ కరెంటు పోల్స్ అవసరం ఉన్న స్థానిక ప్రజా ప్రతినిధులను సంప్రదిస్తే వెంటనే మంజూరు చేస్తాం అన్నారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 01, సెప్టెంబర్ 2024

# వందల కోట్లు దొబ్బిన ఉత్తమ్ కుమార్ రెడ్డి పెద్ద డెకాయిట్

- సివిల్ సప్లై స్కామ్ నీకు ఉరితాడు కాబోతుంది
- సిగ్గు,శరం లేని వాడు ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య , మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ , మాజీ ఎమ్మెల్యేల నన్నపునేని నరేందర్‌తో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్‌లో పెద్ది సుదర్శన్ రెడ్డి



హన్మకొండ,మహానాడు:

దాదాపు సగం క్యాబినెట్ నిన్న దేవాదుల ఇంటెక్ వెల్ వద్ద రివ్యూ చేశారు. 90% పనులు పూర్తి చేసిన కెసిఆర్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి డెకాయిట్ అన్నాడు. ఒక్క సారి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆత్మ విమర్శ చేసుకోవాలి. వందల కోట్లు దొబ్బిన ఉత్తమ్ కుమార్ రెడ్డి పెద్ద డెకాయిట్...సివిల్ సప్లై స్కామ్ నీకు ఉరితాడు కాబోతుంది..జైలుకు వెళ్లే రోజులు దగ్గర పడ్డాయి.

ఉత్తమ్ కి రేవంత్ కి మధ్య సయోధ్య లేదు. ఇది వరంగల్ బిడ్డా. నువ్వు ఏది పడితే అది ఇక్కడ మాట్లాడకు... సిగ్గు,శరం లేని వాడు ఉత్తమ్ కుమార్ రెడ్డి. సివిల్ సప్లైలో 1100 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఏ విదంగా నష్ట పోతుందో నేనే ఆధారాలతో కూడిన వివరాలు ఇచ్చాను. రాష్ట్రంలోని సివిల్ సప్లై కుంభకోణంపై హై కోర్టులో పిల్ వేసిన. తీర్పు రాబోతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క చెరువు నేటికి మత్తడి పడలేదు. ఈ జిల్లా ఎమ్మెల్యే లకు సోయి లేదు. అవగాహన లేదు.

# అనర్హులైన పింఛన్లు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు

- నర్సీపట్నం మండలం, ధర్మసాగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు

ధర్మసాగరం,మహానాడు:

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు అమలవుతుందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఇబ్బందులు ఉన్నప్పటికీ, పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని, సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పంపిణీ చేశామన్నారు.

ఉదయం 9.30 గంటలకే 80 శాతం పింఛన్లు పంపిణీ చేశామని, కొత్తగా అర్హులైన వారికి అక్టోబరు నుంచి పింఛన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అనర్హులైన వారిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, డ్వాక్రా గ్రూపు మహిళలందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.



సెప్టెంబర్ 2న పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా గ్రామాలన్నీ శుభ్రం చేసే కార్యక్రమం ప్రతీ గ్రామంలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం రొంపిచర్ల గ్రామం లో భారీ వర్షంలో పెన్షన్ల పంపిణీ. భారీ వర్షంలోనూ "ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల"పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ మాజీ చైర్మన్, గోనుగుంట్ల కోటేశ్వరరావు**





# గురుకుల పాఠశాల వ్యవస్థను కనుమరుగు చేసే కుట్ర

- గురుకులాలను ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదా ?
- పాలమాకులలో పిల్లలు కారం తిండి తినలేక రోడ్డెక్కారు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ,మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్



హైదరాబాద్,మహానాడు:

రాష్ట్రంలో గురుకుల పాఠశాల వ్యవస్థను కనుమరుగు చేసే కుట్ర జరుగుతోంది. గురుకుల పాఠశాలలో ఇప్పటి వరకు 34 మంది చనిపోయారు. పేద పిల్లలు చనిపోతే సర్కార్ కు పట్టింపే లేదు. పాలమాకుల లో పిల్లలు కారం తిండి తినలేక రోడ్డెక్కారు. సీఎం స్పందించాలి..గురుకులాల పై రివ్యూ చేయాలి

**గురుకులాల్లో నాణ్యమైన తిండి పెట్టడం లేదు.**

కేసీఆర్ పాలనలో గురుకులాలని దేశంలో గొప్పగా తీర్చిదిద్దారు. మన గురుకులాల్లో లక్షల మంది పిల్లలు సీట్లకోసం పోటీపడుతున్నారు. మన రాష్ట్రంలో దేశంలో ఎక్కడలేని విధంగా 1022 గురుకులాలు ఉన్నాయి. మా ప్రభుత్వ హయాంలో గురుకులాలను చూస్తే ఆనందం వేసేది.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలను సర్వనాశనం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఒక్కో విద్యార్థిపై 1లక్షా 25 వేలు ఖర్చు చేసేవారము. సీఎం రేవంత్ రెడ్డి బడాయి మాటలు చెప్పుడు తప్పా.. చేతలు చేయడం లేదు. తెలంగాణ ఏ ఒక్క వ్యవస్థ సంతృప్తిగా లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా అనే అనుమానం వస్తుంది. గురుకులాలను ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదా చెప్పాలి. దానిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి. వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాము.

# జోరు వానలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

- నిర్విరామంగా 10 గంటల పాటు పర్యటించి ముంపు ప్రాంతాల పరిశీలన
- తక్షణ సహాయ చర్యలకు కాల్ సెంటర్ ఏర్పాటు



విజయవాడ,మహానాడు:

అకస్మాత్తుగా సంభవించిన భారీ వర్షాల ప్రకృతి విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి కుండపోతగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షంతో జలమయమైన ప్రాంతాలలో శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. సృజన విశ్రాంతి లేకుండా పర్యటిస్తున్నారు.

జిల్లాలో ఉన్న వాగులు, వంకలు, కాలువలు వర్షపు నీటితో పోటెత్తాయి. తీవ్ర వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజలు సమస్యలను తెలుసుకొనేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టేలా పలు సూచనలు చేశారు. మొగల్రాజపురం సున్నపు బట్టీలు సెంటర్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన ప్రదేశాన్ని పరిశీలించి మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు పరిశీలించారు.



శనివారం తెల్లవారుజామున ప్రారంభమైన జిల్లా కలెక్టర్ పర్యటన శనివారం సాయంత్రం వరకు కొనసాగింది. మునిగిపోయిన రోడ్లను నీరు నిలిచిన పల్లపు ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో కురుస్తున్న వర్షభావంతో పాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటితో మైలవరం నియోజక వర్గం జి కొండూరు ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో బుడమేరు వరదనీటి ముంపు వలన జలమయమైన ప్రాంతాలను కలెక్టర్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండల సమీపంలో కొండపల్లి ఖాజామాన్యం వద్ద బుడమేరు కట్టతెగి భారీ ఎత్తున వరద నీరు నివాస ప్రాంతాలకు చేరుకోవడంతో అక్కడ నివాసముంటున్న ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.

అక్కడకు చేరుకున్న 20 మంది ఎన్డీఆర్ఎఫ్ సభ్యుల బృందం సహాయక చర్యలు చేపట్టేందుకు కష్టపడుతున్నారు. కలెక్టర్ స్థానిక అధికారులను అప్రమత్తం చేసి ఎన్డీఆర్ఎఫ్ సభ్యుల బృందానికి తోడ్పాటు అందించాలని రెవిన్యూ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం ముంపుకు గురైన కొండపల్లి పారిశ్రామిక వాడ విటిపీఎస్ లోని పలు కాలనీలు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వద్ద లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

చందర్లపాడు మండలం ముప్పాళ్ళ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు కొనసాగించ కుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్థానిక అధికారులను ఆదేశించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు పొంగిపొర్లడంతో నందిగామ చందర్లపాడు మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించయని నందిగామ నుండి చందర్లపాడు వెళ్లే మార్గంలో అడవిరావులపాడు చందా పురంల వద్ద నల్లవాగు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయని కలెక్టర్ తెలిపారు.

అలాగే పెనుగంచిప్రోలు– నందిగామ, పెనుగంచిప్రోలు – జగ్గయ్యపేట మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా మార్గాలలో ప్రజలు ప్రయాణించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు మరో ఒకటి రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు రేయింబ వళ్లు అప్రమతత్తతో ఉండాలని ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పేరేమో ఉత్తమ్ - మాట తీరేమో మూసీ

- కమిషన్ల కోసం జలయజ్ఞం ప్రారంభించింది మీరు
- మంత్రి ఉత్తమ్ కు మాజీ మంత్రి హరీష్ రావు కౌంటర్

హైదరాబాద్,మహానాడు:

మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను డెకాయిట్ అని మంత్రి ఉత్తమ్ సంభోదించడం ఆయన దిగజారుడు మనస్తత్వానికి నిదర్శనం. బూతులు మాట్లాడడంలో, అన్ పార్లమెంటరీ భాషను ఉపయోగించడం ముఖ్యమంత్రి రేవంత్‌కు నేనేమి వెనుకబడలేదని నిరూపించాలనుకున్నావా ఉత్తమ్?

పేరేమో ఉత్తమ్ కుమార్ – మాట తీరేమో మూసీ ప్రవాహం. రేవంత్ నోటితో పాటూ ఉత్తమ్ నోరు కూడా ప్రక్షాళన చేయాల్సి ఉంది. జలయజ్ఞంలో EPC కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టి ఇష్టమున్నట్టు ప్రాజెక్టుల అంచనా విలువలను పెంచేసి, ఏజెన్సీలకు మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టి, నిబంధనలకు విరుద్ధంగా సర్వే, డిజైన్ అడ్వాన్స్ లను 0.5 శాతం నుంచి 3.5 శాతానికి పెంచుకొని రాష్ట్రాన్ని డెకాయిటీ చేసింది ఎవరు ? వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకున్నదెవరు ? మీరు కాదా ఉత్తమ్?

ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 17 వేల కోట్ల నుండి తట్ట మట్టి ఎత్తకుండానే 40 వేల కోట్లకు పెంచుకున్న సంగతిని మరచిపోయావా ఉత్తమ్? ఇగో మీ కాంగ్రెస్ డెకాయటి గురించి ఇప్పటికే ఎన్నోసారు చెప్పి ఉన్నా. మళ్ళీ గుర్తు చేస్తున్న.

తొలుత జి ఒ నంబరు 124 తేదీ 16.05.2007 ద్వారా రూ. 17,875 కోట్లకు ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి మంజూరు చేసి ఆ తర్వాత 19 నెలల్లోనే పనులు మొదలు కాకుండానే జి ఒ నంబరు 238 తేదీ 17.12.2008 ద్వారా రూ.38,500 కోట్లకు పరిపాలనా అనుమతిని సవరించింది మీరు మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాదా?

తుమ్మిడిహట్టి బ్యారేజి నిర్మాణానికి మహారాష్ట్రాతో ఎటువంటి ఒప్పందం చేసుకోకుండానే ప్రాజెక్టు పనులని 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు ఖరారు చేసి తలను వదిలేసి తోక దాకా ఏక కాలంలో పనులని ప్రారంభింపజేసి అడ్వాన్స్ లు దండుకున్నది మీరు కాదా?

2010 లో కేంద్ర ప్రభుత్వానికి DPRని రూ.40,300 కోట్లకు సవరించి పంపింది నువ్వు మంత్రిగా ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా ?

నాలుగేండ్లలో పూర్తి చేస్తామని ప్రభుత్వం ఈ కాలంలో పెట్టిన ఖర్చు ఎంతో తెలుసా ఉత్తమ్ నీకు ? 2008-09 నుండి 2012 దాకా పెట్టిన ఖర్చు:

మొబిలైజషన్ అడ్వాన్స్ చెల్లింపులు:651. 28 కోట్లు
సర్వే & ఇన్వెస్టిగేషన్ కోసం చెల్లింపులు : 829.51 కోట్లు
పనుల కోసం చెల్లింపులు : 151.93 కోట్లు



భూసేకరణ : 16.93 కోట్లు
ఇతర ఖర్చులు : 14.52 కోట్లు

నాలుగేండ్లలో ప్రాజెక్టు పనులు, భూసేకరణ కోసం పెట్టిన ఖర్చు : 151.93 ం 16.93 = 168.86 కోట్లు

మొబిలైజేషన్ కోసం చెల్లింపులు (జూన్ 2014 వరకు) : 651.28 + 775.32 = 1426.60 కొట్లు

ఇదీ ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టులో మీరు మంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం డెకాయిటీ.

రాష్ట్రం ఏర్పడిన 9 ఏండ్లలో వ్యవసాయ రంగం అభివృద్ధిలో, ఇతర మానవాభివృద్ధి సూచికల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టిన ఘనత కెసిఆర్ ది.

2014-15 నుంచి 2023-24 మధ్య కాలంలో ఆహార పంటల ఉత్పత్తి వృద్ధి రేటు పెరుగుదలపై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన నివేదిక ఏమి చెప్పిందో తెలియదా ఉత్తమ్?

16.42 శాతం వృద్ధి రేటును సాధించి, పంజాబ్, హర్యానా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రా లాంటి పెద్ద వ్యవసాయ రాష్ట్రాలను వెనక్కి నెట్టి అగ్ర స్థానంలో నిలచింది తెలంగాణ. రెండవ స్థానంలో ఉన్న మహారాష్ట్రా సాధించిన వృద్ధి రేటు 7.11 శాతం. తెలంగాణ దరిదాపుల్లో కూడా ఈ రాష్ట్రాలు లేవు.

ఆ నివేదిక ప్రకారం తెలంగాణలో 2014-15 లో పంటల సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు ఉంటే 2022-23 నాటికి అది 2.21 కోట్ల ఎకరాలకు పెరిగింది.

ఈ స్థాయిలో ఆహార పంటల ఉత్పత్తిలో, పంటల విస్తీర్ణాన్ని సాధించడంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టింది కేసిఆర్ కాదా? కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు అనుకూల వ్యవసాయ విధానాలు కావా?

కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితం కండ్ల ముందు సాక్షాత్కరించింది. తెలంగాణ వ్యవసాయానికి ఊపిరిలూదిన ఈ ప్రాజెక్టు నాశనం కాలేదు. దేశ వ్యవసాయ రంగంలో తెలంగాణను అగ్రభాగాన నిలిపింది.

మీరు అధూరా వదిలి పెట్టిపోయిన అనేక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి, రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాల కల్పనలో అద్భుతమైన ప్రగతి సాధించినందు వల్లనే ఈ వృద్ధి రేటు సాధ్యం అయ్యింది.

కాళేశ్వరంతో పాటు కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, తుమ్మిళ్ళ, భక్తరామదాసు, చౌటుపల్లి హనుమంత్ రెడ్డి ఎత్తిపోతల, గూడెం తదితర ఎత్తిపోతల పథకాలను, సింగూర్ కాలువలు, కిన్నెరసాని కాలువలు, కొమురం భీం, నీలవాయి, గొల్లవాగు, మత్తడివాగు, ర్యాలివాగు, గడ్డెన్న సుద్దవాగు, పాలెం వాగు, బేతుపల్లి వరద కాలువ, గట్టు పొడిచిన వాగు,

తదితర ప్రాజెక్టులను పూర్తి చేసి, శ్రీరాంసాగర్, నిజాం సాగర్, నాగార్జునసాగర్, ఘన్ పూర్ ఆనకట్ట కాలువలు, స్వర్ణ, సాత్నాలా, చెలిమెలవాగు, నల్లవాగు, సదర్ మాట్ ఆనకట్ట కాలువల ఆధునీకీకరణ, 28 వేల చెరువుల పునరుద్ధరణ, నదులు, వాగులపై చెక్ డ్యాంల నిర్మాణం, చెరువులను ప్రాజెక్టులతో అనుసంధానం.. ఇట్లా బహుళ అంచెల వ్యూహాన్ని అమలు చేసినందువలన రాష్ట్రంలో రెండు పంటలకు సాగునీటి సరఫరా అనూహ్యంగా పెరిగింది.

శ్రీరాంసాగర్ రెండవ దశ కాలువల వ్యవస్థను పూర్తి చేసి కాళేశ్వరం ద్వారా 4 లక్షల ఎకరాలకు మొదటిసారి నీరు అందించింది మా కెసిఆర్ ప్రభుత్వం.

భూగర్భ జలాలు పెరగడం వలన, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటు సరఫరా చేసినందువలన 30 లక్షల బోర్ల కింద సుమారు 45 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి.

వ్యవసాయ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టిన కెసిఆర్ ను డెకాయిట్ అని అనడానికి నీకు నోరెలా వచ్చింది ఉత్తమ్ ? ఇంతకంటే దారుణం, మహా పాపం మరొకటి ఉండదు. దేవాదుల ప్రాజెక్టులో 300 రోజులు 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసినామని మీ ఘనతగా చెప్పుకున్నావు. సమ్మక్కసాగర్ బ్యారేజి కట్టకపోయి ఉంటే ఆ పని చేయగలిగేవారా?

దేవాదుల ప్రాజెక్టుకు నిల్వ లేకుండా ప్రాజెక్టును రూపకల్పన చేసింది చంద్రబాబు అయితే, కాంతనపల్లి పేరు మీద ప్రాజెక్టును ఆదివాసీ గ్రామాల ముంపు, పునరావాస సమస్యల్లో, పర్యావరణ సమస్యల్లో కూరుకుపోయేలాగా చేసి ప్రాజెక్టును మీరు కట్టకుండా వదిలేసింది మీరు.


దేవాదుల ప్రాజెక్టు కింద ఆయకట్టును, ఆయకట్టు పరిధిలో ఉన్న వేలాది చెరువులను నింపడానికి బ్యారేజి అవసరాన్ని గుర్తించి ముంపు, పునరావాస సమస్యలను, పర్యావరణ సమస్యలను తొలగించి సమ్మక్క బ్యారేజీని మూడేండ్లలో నిర్మించింది కెసిఆర్ ప్రభుత్వం. బ్యారేజి నిర్మాణం పూర్తి అయిన తర్వాతనే దేవాదుల ప్రాజెక్టు కింద పంపింగ్ ఎక్కువ రోజులు చేయడానికి వెసులుబాటు ఏర్పడింది.

కెసిఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను మీవిగా చెప్పుకోవడం మీకు కొత్తేమీ కాదు. సీతారామ ప్రాజెక్టులో మూడు పంప్ హౌజ్ లు పూర్తి చేసి రెడీగా పెడితే బటన్ వొత్తి ప్రాజెక్టును మీ ఘనతగా చెప్పుకున్న వైనం చూసి ఖమ్మం జిల్లా ప్రజలు నవ్వుకున్నారు. ఇప్పుడు వరంగల్ జిల్లా ప్రజలు కూడా నవ్వుకుంటున్నారు.

కమిషన్ల కోసం జలయజ్ఞం ప్రారంభించింది మీరు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడానికి మీరు వదిలిపెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసింది మేము.

జనం గుండె చప్పుడు
# మహానాడు
6
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || ఆదివారం 01, సెప్టెంబర్ 2024

# సెల్యూట్..
## మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్



**మంగళగిరి,మహానాడు:** విధి నిర్వహణలో పోలీస్ శాఖ అత్యంత విలువైన పాత్ర అనేది అందరికి తెలుసు. అలాంటి పోలీస్ శాఖలో నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పొంగుతున్న వాగులు కాలువలు.

గుంటూరు విజయవాడ ప్రధాన రహదారి మంగళగిరి టోల్ ప్లాజా వద్ద వరద నీరు రోడ్డుపైకివచ్చి ట్రాఫిక్ అంతరాయం అని విషయం తెలుసుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ళ వెంకట్ హుటాహుటిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు.స్వయంగా రంగంలోకి స్థానికుల సహాయంతో వాహనాలు జాగ్రత్తగా పంపే ప్రయత్నం. అటుగా ప్రయాణం చేస్తున్న వారితో సెభాష్ పోలీస్ అనేలా చేశారు.

తమ ఆరోగ్యం ముఖ్యం కాదని ప్రజలను సేఫ్టీగా ఇళ్ళకు పంపాలని ఆయన విధి నిర్వహణకు సెల్యూట్. ఆయన ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వాహనాల్లో వచ్చే వారు రావద్దని, 2 మీటర్ల ఎత్తులో వరద నీరు ప్రవాహం ఉందని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసరం అయితే తప్పించి బయటకు రావద్దని, అసలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని హితవు పలికారు.

ఏది ఏమైనా ఇలాంటి ఆఫీసర్ సమాజానికి కావాలి. భరోసా ఇస్తూ విధులు నిర్వహిస్తున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ళ వెంకట్‌కు సెల్యూట్.

# స్వయంకృషి, పట్టుదలతో ఐసీసీ చైర్మన్ అయిన జే షా!




నిరుపేద కుటుంబంలో పుట్టిన జేషా, తిండి తిప్పలకోసం అష్ట కష్టాలు పడ్డారు. పలుకుబడి కలిగిన వారెవరితోనూ సంబంధం లేని వారు. అయినప్పటికీ అతని పూర్తి కృషి మరియు క్రికెట్ పట్ల మక్కువతో భారత క్రికెట్‌లోకి ప్రవేశించారు. అతని అద్భుతమైన సంస్థాగత నైపుణ్యాలతో, అనతి కాలంలోనే బీసీసీఐ కార్యదర్శిగా నియమించబడ్డారు. ప్రపంచం అతని ప్రతిభను చూసి అతడిని చైర్మన్ పదవిని చేపట్టమని క్రికెట్ ప్రపంచం మొత్తం,ఏకగ్రీవంగా కోరింది. బంధుప్రీతి ద్వారా నిచ్చెనలు ఎక్కుదామనుకున్న వారికి, ఈయన ఎన్నిక ఒక గట్టి చెంపదెబ్బ ఎందుకంటే ఈ వ్యక్తి ఎటువంటి మద్దతు లేకుండా తన గుర్తింపును సాధించారు.

జై షా సార్! స్వయంకృషితో పైకొద్దామనుకున్న వారికి మీరు ఒక స్ఫూర్తి!

భారత రత్నను కూడా స్వయంకృషితో సొంతం చేసుకోండి!!

**- రవీంద్ర తీగల**




# చెరువులైన గుంటూరు రోడ్లు!



**గుంటూరు, మహానాడు:** నగరంలో చెరువుల లేకపోవడంతో రోడ్లు మొత్తం చెరువులు మయం... ఏటి అగ్రహారం ప్రధాన రహదారి పూర్తిగా వరద మయంగా మారింది.

ఏటగ్రహారం 14వ లైన్ లో ఇళ్ళల్లోకి చేరిన వర్షపు నీరు. పీకల వాగుకి రక్షణ గోడ లేకపోవడంతో ఏం జరుగుతుందో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# నూజివీడు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ తొలగింపు

- ముగ్గురు సభ్యులతో పర్యవేక్షక కమిటీ
- మంత్రి లోకేష్ ఆదేశాలు

**అమరావతి, మహానాడు:** నూజివీడు ట్రిపుల్ ఐటిలో ప్రక్షాళన ప్రారంభమైంది. ఇక్కడ పెద్దఎత్తున విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సీరియస్‌గా తీసుకున్నారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూజివీడు ట్రిపుల్ ఐటి డైరక్టర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఐటి పర్యవేక్షణ కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. ఇందులో కాలేజి ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యశాఖ ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వి సభ్యులుగా ఉంటారు.




**పర్యవేక్షణ కమిటీ ఈ కింది అంశాలపై దృష్టిసారిస్తుంది**

- విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ పాటించడం.
- పారిశుద్ధ్యం, మెస్ పరిశుభ్రత నిర్వహణ కోసం ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ అమలుచేయడం.
- విద్యార్థుల హాస్టల్‌లో మెరుగైన పారిశుద్ధ్యం, నాణ్యతా ప్రమాణాల అమలుకు చర్యలు తీసుకోవడం.
- నూజివీడు ట్రిపుల్ ఐటిలో అవసరాలకు అనుగుణంగా చిన్నచిన్న మరమ్మతులు చేయడం.
- లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గత ఫిర్యాదు కమిటీని ఏర్పాటు చేయడం, ఫిర్యాదుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వేగంగా వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం.
- ప్రతి డిపార్ట్‌మెంట్ స్థాయిలో తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం ద్వారా డ్రగ్ ఫ్రీ, పొగాకు రహిత సంస్థల కోసం కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం.
- ప్రతి విద్యార్థి విషయంలో మానసిక ఒత్తిడి తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యానికి చర్యలు తీసుకోవడం. విద్యార్థుల మానసిక శారీరక శ్రేయస్సు కోసం కాలేజ్ వెల్‌నెస్ టీమ్‌ను ఏర్పాటు. కాలేజీ వెల్‌నెస్ టీమ్‌లో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ (లేదా తత్సమానం), ఇద్దరు సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు (ప్రాధాన్యంగా స్త్రీ), ప్రతి విభాగం నుండి విద్యార్థి మానిటర్లు, తల్లిదండ్రుల సంఘం ప్రతినిధులు ఉంటారు. సంస్థ ప్రధాన పర్యవేక్షకులు, కౌన్సెలర్లు / మెడికల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో హాని కలిగించే విద్యార్థుల చుట్టూ భద్రతా వలయం ఏర్పాటుచేసి దేగకన్నేసి ఉంచుతారు.



- ఆహార నాణ్యత, చిన్నచిన్న మరమ్మతులు, కొన్ని సున్నితమైన అంశాలు, వైద్య పర్యవేక్షణపై ఫిర్యాదులు వంటి సమస్యల తక్షణ పరిష్కారానికి నిర్ణీత సమయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి నారా లోకేష్ పర్యవేక్షక కమిటీకి సూచించారు.

ఏవైనా అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే కమిటీ ఆ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు.

# జగన్ బాటలో చంద్రబాబు!

- ఏపీసీసీ చీఫ్ షర్మిల విమర్శ



**విజయవాడ, మహానాడు:** వైద్య, విద్యా సంస్థలకు ఎన్టీఆర్ పేరు తొలగించి మాజీ సీఎం జగన్ ఆనాడు పెద్ద తప్పు చేస్తే... ఇప్పుడు అదే బాటలో నడుస్తున్నారు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఏపీసీసీ చీఫ్ షర్మిల విమర్శించారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు, ఆసుపత్రులకు దివంగత ముఖ్య మంత్రి వైఎస్ పేరు తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతీకార చర్యగా భావిస్తోంది. ఎన్టీఆర్ అయినా, వైఎస్ఆర్ అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడిన వాళ్ళే.. పాలనలో తమదైన ముద్ర వేసిన వాళ్ళే.. రాజకీయాలకు అతీతంగా ఇద్దరిని చూడాలి తప్పితే.. నీచ రాజకీయాలు ఆపాదించడం సమంజసం కాదు. వైఎస్ఆర్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీ యింబర్స్ మెంట్, రుణమాఫీ, ఉచిత కరెంట్,పెన్షన్లు, ఇలా ప్రతి పథకం దేశానికే ఆదర్శం. వైఎస్ఆర్ ఏదో ఒక్క పార్టీకి సొంతం కాదు.. తెలుగు వారి ఆస్తి. తెలుగు వారి గుండెల్లో ఆయన స్థానం ఈనాటికీ పదిలం. వైసీపీ మీద ఉన్న కోపాన్ని వైఎస్ఆర్ మీద రుద్దడం సరికాదు. వైసీపీలో వైఎస్ఆర్ లేరు.. అది ఎన్నటికైనా వైవీ, సజ్జల, సాయి రెడ్డి పార్టీనే...

# అందిన కాడికి దోచుకుంటున్న మీరు డెకాయిట్

- ఇంకా కేసీఆర్ మీద ఏడవటం మీ చేతకాని తనానికి నిదర్శనం
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్,మహానాడు:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

"తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి,10 ఏండ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన కేసీఆర్ ను డెకాయిట్ అనడం ఉత్తమ్ కుమార్ రెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనం. నిన్నటి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలకు సంబరపడి, ఉత్తమ్ తనకు తాను ముఖ్యమంత్రి గా ఊహించుకొని రేవంత్ రెడ్డి లాగా బూతులు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాడా? లేక కాంగ్రెస్ లో రేవంత్ రెడ్డిని మించి కేసిఆర్‌ని తిడితే ముఖ్యమంత్రి అవుతానని అనుకుంటున్నాడా?

ప్రజాపాలన పేరుతో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చి.. దోపిడీ పాలన చేస్తున్న మీరు డెకాయిట్లు. ఉత్తమ్ మాటలు దొంగే దొంగ దొంగ అని అరిచనట్లు ఉన్నాయి. నీ శాఖ సివిల్ సప్లై లో అవినీతి చేసి, ఆ అవినీతిని మేము అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తే సమాధానం చెప్పకుండా పారిపోయిన మీరు డెకాయిట్. అధికారంలోకి వచ్చి 10 నెలలైన ఇంకా పాలన మీద పట్టు లేదు..ప్రజల సమస్యలు గాలికి వదిలి అందిన కాడికి దోచుకుంటున్న మీరు డెకాయిట్.చివరికి గురుకులాల్లో పిల్లల నోటికాడి ముద్దను కూడా లాక్కోని మింగుతున్న మీ కాంగ్రెస్ నాయకులు డెకాయిట్లు. అధికారం మారిన 10 నెలల తర్వాత కూడా పరిపాలన మీద దృష్టి పెట్టకుండా ఇంకా కేసీఆర్ మీద ఏడవటం మీ చేతకాని తనానికి నిదర్శనం

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతున్నారు. ంప్రజలు అన్ని గమనిస్తున్నారు. రాబోయే కాలంలో మీకు ప్రజలే బుద్ధి చెబుతారు. కేసీఆర్ పై మీరెన్ని మాట్లాడిన ఆకాశం మీద ఉమ్మేసినట్టే"

# ఆంధ్రప్రదేశ్ అనాథ

- జగన్ లొంగుబాటు పర్యవసానంగా ట్రిబ్యునల్ ఏర్పాటు!
- జీవన్మరణ సమస్యగా పరిణమించిన కృష్ణా జలాల సమస్య!
- కూటమి ప్రభుత్వం వినడానికే సిద్ధంగా లేదు!
- రాజకీయ పార్టీలకు అసలు ఈ సమస్యే పట్టలేదు!



**విజయవాడ, మహానాడు:** నిన్న, మొన్న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ – II (బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్) ఈ అంశంపై విచారణ ప్రక్రియను కొనసాగించింది. తెలంగాణ లేవనెత్తిన నీటి వివాదాన్ని విచారించడానికి 40 ముసాయిదా అంశాలను ఖరారు చేసిందని ప్రసరమాధ్యమాల్లో వార్తలొచ్చాయి. వాటి ప్రాతిపదికన విచారణను కొనసాగించడానికి తదుపరి విచారణను సెప్టెంబరు 20కి వాయిదా వేసింది.

నీటి పంపకాల వివాదాలకు సంబంధించి సంబంధిత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తమ తమ వాదనలు వినిపించాలి. సాక్ష్యాలను సమర్పించాలి. ట్రిబ్యునల్ తమకు సమర్పించిన సమర్పణలను సమీక్షిస్తుంది. చారిత్రక నీటి వినియోగం, పరివాహక ప్రాంతం కొలబద్ద వర్తిస్తుందా – లేదా, భవిష్యత్తు అవసరాలతో సహా ట్రిబ్యునల్ ముందుంచే సమాచారాన్ని విశ్లేషించి, తీర్పు ఇస్తుంది. అంతర్రాష్ట్ర నదీ జలాల వినియోగానికి సంబంధించి ట్రిబ్యునల్ తీర్పులే శిరోధార్యం.

కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ – I (బచావత్ ట్రిబ్యునల్), కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ – II (బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్) విచారణ కాలంలో తెలంగాణ రాష్ట్రం ఉనికిలో లేదని, పర్యవసానంగా తెలంగాణకు నీటి పంపకంలో నష్టం జరిగిందంటూ తెలంగాణ వాదిస్తున్నది.

ఆ రెండు ట్రిబ్యునల్స్ విచారణ, అవార్డులు ఇచ్చినప్పుడున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు ఉనికిలో లేదు. గతంలో ట్రిబ్యునల్స్ ఇచ్చిన తీర్పులను రెండు రాష్ట్రాలకు శిరోధార్యమని ఆంధ్రప్రదేశ్ పున్వవ్యవస్థీకరణ చట్టంలో విస్పష్టంగా పేర్కొన్నారు. అయినా, తెలంగాణ వివాదాన్ని లేవనెత్తింది.

మోడీ ప్రభుత్వం ఆ వివాదంలోని హేతుబద్ధతను పరిగణనలోకి తీసుకోకుండానే బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువును పెంచి, విచారించి, తీర్పు ఇమ్మని బాధ్యత అప్పగించింది. తద్వారా, కృష్ణా జలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హక్కులపై కత్తి వేలాడుతున్నది. సమస్య తీవ్రతను రాష్ట్ర ప్రజలకు తెలియజేయడానికి ఎన్నికలకు ముందే మే నెలలో "కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ – కొత్త ప్రభుత్వం ముందున్న పెనుసవాల్" శీర్షికతో ఒక చిరుపుస్తకాన్ని వ్రాసి, ప్రచురించాను. ఈ సమస్యపైనే రైతు సంఘాల సమావేశం విజయవాడలో నిర్వహించబడింది. ఈ సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళడానికి రైతు సంఘాల ప్రతినిధివర్గానికి ఇంటర్వ్యూకోరుతూ ఉత్తరం వ్రాశాను. స్పందన కరవయ్యింది.

అటుపై, సమస్యను వివరిస్తూ ఐదు పేజీల వినతిపత్రాన్ని ఇ-మెయిల్, వాట్సాప్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పంపాను. దాన్ని ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి, కృష్ణా నది జలాలపై ఆధారపడి ఉన్న జిల్లాల నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రులకు పంపాను. దాన్ని సోషల్ మీడియాలో కూడా షేర్ చేశాను. తద్వారా ప్రజల దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాను.

కరవు పీడిత రాయలసీమ ప్రాంతంలో దశాబ్దాలుగా నిర్మాణంలో ఉన్న తెలుగు గంగ, హంద్రీ – నీవా సుజల స్రవంతి, గాలేరు – నగరి సుజల స్రంతి, ప్రకాశం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థంగా మారింది. వినియోగంలో ఉన్న పురాతనమైన కృష్ణా డెల్టా ఆయకట్టులోని అత్యధిక భాగాలు, నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు, పురాతనమైన కర్నూలు – కడప కాలువ, తుంగభద్ర ఎగువ కాలువ, శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ, వగైరా ప్రాజెక్టులన్నీ కృష్ణా బేసిన్ బయట ఉన్న ప్రాజెక్టులని, వాటికి కేటాయించిన నీటిని తెలంగాణకు కేటాయిస్తూ పున: పంపిణీ చేయాలని తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తున్నది.

ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు ఎదురైనా ప్రభుత్వంలో కానీ, రాజకీయ పార్టీల్లో కానీ, పెద్దగా చలనం లేకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇప్పటికైనా దృష్టిసారించి, ట్రిబ్యునల్ ముందు సమర్థవంతంగా వాదనలు వినిపించి, ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను పరిరక్షించకపోతే భావితరాలు క్షమించవు.



**- టి. లక్ష్మీనారాయణ**
**ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక**
**విజయవాడ**

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ ఆదివారం 01, సెప్టెంబర్ 2024



## వల్లూరులో జగన్‌కు ఘన స్వాగతం

కడప ఎయిర్ పోర్ట్ నుంచి పులివెందుల మార్గమధ్యంలో కమలాపురం నియోజకవర్గం వల్లూరులో వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు జగన్‌కు స్వాగతం పలికిన కార్యకర్తలు, అభిమానులు





# పిఠాపురంలో కమిషనర్, డీఈఈ ముష్టియుద్ధం!

- హఠాత్పరిణామానికి ముక్కున వేలేసుకున్న ప్రజాప్రతినిధులు

**కాకినాడ, మహానాడు**

పిఠాపురం మున్సిపాలిటీ అధికారులు ముష్టియుద్ధం చేశారు. మున్సిపల్ సమావేశంలో కమిషనర్ కనకరావు, డీఈఈ భవానీ శంకర్ బాహాబాహికి దిగి కొట్టుకున్నారు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల సాక్షిగా పరస్పర దాడి చేసుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపులు విషయమై



కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ కనకరావు సమాధానం చెప్తూ డీఈఈపై ఆరోపణలు చేశారు. ప్రతిగా స్పందించిన డీఈఈ కమిషనర్ పై ప్రత్యారోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య వాగ్వాదం జరిగి కొట్టుకున్నారు. ఈ హఠాత్పరిణామానికి ప్రజాప్రతినిధులు ముక్కున వేలేసుకున్నారు. గత కొంతకాలంగా కమిషర్, డీఈఈల మధ్య కోల్డ్‌వార్ జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# అధికారులను అప్రమత్తం చేశాం

- భాదితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా

**విజయవాడ,మహానాడు:**



జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలను తక్షణ సహాయక చర్యలు అందించేలా అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని కొండచరియలు విరిగిపడిన సంఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా తెలిపారు.

నగరంలోని మొగల్రాజపురం సమీపంలోని సున్నపు బట్టీల ప్రాంతాన్ని శనివారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా, జిల్లా కలెక్టర్ డా. జి. సృజనతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన సంఘటనన్నారు.

ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించామన్నారు. ఇటువంటి సంఘటలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించమన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు చెరువులు పొంగిప్రవహిస్తున్నాయని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు.

లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అవసరమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయం అందిస్తున్నామన్నారు. ముంపుకు గురైన ప్రాంతాలలో డ్రైన్ల పూడిక తీసి వర్షపు నీటిని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యతనిచ్చి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి. సిసోడియా తెలిపారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ హెచ్‌ఎం. ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవాని శంకర్, తహశీల్ధార్ రోహిణి ఉన్నారు.

# వరద ఉధృతికి కొట్టుకుపోయిన లారీ

**నూజివీడు,మహానాడు:**

పట్టణంలోని బైపాస్ రోడ్డులో కోళ్ల మేతతో వెళుతున్న లారీ వరద ఉధృతికి కాలువలోకి శనివారం కొట్టుకుపోయింది. అక్కడే ఉన్న స్థానికులు లారీ డ్రైవర్ను రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.డ్రైవర్ పాపారావు మాట్లాడుతూ.. కోళ్ల మేతతో వస్తుండగా వరద ఉధృతికి లారీని లాక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు.



# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమ

**విజయవాడ, మహానాడు:**

నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలన్నారు. అవసరమైన సహాయక చర్యలకు ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉండాలని కోరారు.. మ్యాన్ హోల్, కరెంట్ తీగలు తెగిపడే ప్రమాదాలు జరగకుండా చూడాలని, ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకం లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. శనివారం ఆయన పలు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అవసరమైన చోట్ల మురుగునీటిని మోటార్ల సాయంతో తోడించాలని అధికారులను ఆదేశించారు.

# ఒక రోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్నాం..

- శాసనసభ్యులు వనమాడి కొండబాబు

**కాకినాడ,మహానాడు:**

సామాజిక భద్రతలో భాగంగా ఎన్టీఆర్ పెన్షన్ భరోసా క్రింద పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అంద జేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు.



శనివారం స్థానిక 39వ డివిజన్ రామారావు పేట నందు సచివాలయ సిబ్బంది తదితరులతో కలిసి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్లను అర్హులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ లబ్ధిదారులకు అందజేస్తుందన్నారని, సెప్టెంబర్ ఒకటవ తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీన లబ్ధిదారులు అందరికీ పెన్షన్ అందజేస్తున్నామన్నారు.



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలోని మోడల్ కాలనీలో వర్షంలో గొడుగు సాయంతో శనివారం పింఛన్లు పంపిణీ చేస్తున్న అంగన్వాడీ టీచర్ బి.నీరజ



రాష్ట్రవ్యాప్తంగా ఒకరోజు ముందుగానే పింఛన్ల పండగ వచ్చింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు జడివానలో లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ వింజమూరు మండలం ఊటుకూరు గ్రామంలో జడివానలో పింఛన్లు పంపిణీ చేశారు.

# నాగార్జున సాగర్ గేట్లన్నీ ఎత్తివేత

నాగార్జున సాగర్‌కు భారీ వరద పోటెత్తడంతో అధికారులు గేట్లన్నీ ఎత్తివేశారు. మొత్తం 26 రేడియల్ క్రస్ట్ గేట్లలో 4 గేట్లు 10 అడుగులు, 22



గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నీటి మట్టం 589 అడుగులుగా ఉంది.

# నీట మునిగిన ప్రాంతాల్లో మంత్రి నాదెండ్ల పరిశీలన

**గుంటూరు, మహానాడు:**

తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలకు తెనాలి పట్టణంలో రోడ్లన్నీ జలమయం కావటంతో అధికారులతో కలిసి శనివారం మంత్రి నాదెండ్ల



మనోహర్ పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రోడ్లపై ఉన్న నీరు వెళ్లే మార్గం చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఎందుకు గొడవ చేస్తున్నారు?

- 'గుడ్లవల్లేరు' అమ్మాయిలపై పోలీస్ ఆగ్రహం

**గుడ్లవల్లేరు,**

ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థినులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వారిపై ఓ మహిళా పోలీస్ ఆగ్రహం వ్యక్తం చేయడం విమర్శలకు దారితీసింది.'విచారణ జరుగుతోంది.. మీరు ఎందుకు ఇలా గొడవ చేస్తున్నారు.

ఎస్పీ అధికారి చెప్తున్నా మీకెందుకు అర్థం కావట్లేదు?' అని పోలీస్ మండిపడ్డారు. తిండి తిప్పలు లేకుండా వర్షంలో తడుస్తున్నామని ఆమె చెప్పగా, మీకు బాధ్యత లేదా? అని అమ్మాయిలు ప్రశ్నించారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది.





జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024

## పింఛన్ లబ్ధిదారుల్లో ఆనందం చూశా...

**- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్**

**ఒంగోలు, మహానాడు:** ఇంటింటికి వెళ్ళి పింఛన్ పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తుంటే చాలా సంతోషంగా ఉందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఒంగోలు నగరంలోని 21వ డివిజన్‌లో శనివారం పర్యటించిన జనార్దన్.. స్థానిక నేతలతో కలిసి ఇంటింటికి వెళ్ళి పింఛన్లు పంపిణీ చేశారు. వర్షంలో కూడా పింఛన్లు పంపిణీ చేయడంలో లబ్ధిదారులు ఆనందపడ్డారు.

ఈ సందర్భంగా జనార్దన్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సెలవు కావడంతో ముందు రోజే పెన్షన్ల పంపిణీకి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, లబ్ధిదారుల సంక్షేమం కోసం ఆలోచించే కూటమి ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.



టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరావు, ఒంగోలు నగర టీడీపీ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జానపద కళల పరిరక్షణకు కృషి

- **కవులు, కళాకారులకు సముచిత స్థానం**
- **పర్యాటకంలో తెలంగాణ సంస్కృతి, కళారూపాల ప్రదర్శనలకు ప్రణాళికలు: మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, ఆగస్టు 31,మహానాడు:**
తెలంగాణలో అంతరించిపోతున్న జానపద కళారూపాలకు మళ్లీ పునరుత్తేజాన్ని తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కళా రంగానికి పెద్దపీట వేస్తుందని, కవులు, కళాకారులు, రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం భాషా సంస్కృతిక శాఖ - సారిపల్లి కొండల రావు ఫౌండేషన్ - యువకళావాహిని- తెలంగాణ రాష్ట్రజానపద కళాకారుల సంఘం ఆద్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీవీలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల లాంటి ప్రసార మాధ్యమాలు రాకముందు కథలు, నాటికలు వేసే జానపద కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని, దీంతో కష్టానికి తగ్గ ఫలితం పొందేవారన్నారు. కానీ ప్రస్తుతం అరచేతిలో ప్రపంచాన్ని చూసే రోజులొచ్చాక కళాకారుల పరిస్థితి దయనీయంగా మారిపోయిందని, దీంతో కళాకారుల వద్ద ఉన్న ప్రతిభను మాటల్లో చెప్పుకోవడానికి తప్ప ప్రదర్శిస్తే చూసేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కాలంలో యువత వ్యాపకాలు మారిపోయాయని, చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని, యువతలో మార్పు తీసుకువచ్చేందుకు కవులు, కళాకారులు, రచయితలు బాధ్యత తీసుకోవాలని కోరారు.




ఒక దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే, ప్రాచీన వారసత్వాన్ని భావితరాలకు అందించే కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై ఉందని తెలిపారు. కళలను నమ్ముకొని జీవించే కళాకారులను ప్రోత్సహిస్తూ.. వారికి అండగా నిలవాల్సిన అవ సరం ఉందని చెప్పారు.

పర్యాటక రంగంలో జానపద కళాకారుల సేవలను ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు తెలం గాణ సంస్కృతి, సంప్రదాయాలు, తెలంగాణ కళా రూపాలను తెలియజేసేలా చర్యలు తీసుకుంటు న్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజల, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు కెతావత్ సోమలాల్, గడ్డం సమ్మయ్య, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, జానపద కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు కె.వి.రమణాచారి, పారి శ్రామికవేత్త సారిపల్లి కొండల రావు, యువకళావాహిని అధ్య క్షులు లంకా లక్ష్మీనారాయణ, అమిగోస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు రమణరెడ్డి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, లింగయ్య, , తదితరులు పాల్గొన్నారు.

## బాపూ గీత, రమణ రాత నిత్యనూతనమే...

2014, ఆగస్టు 31న ఓ 80 ఏళ్ళ పెద్దాయన కాలం చేస్తే... కుంచె కన్నీరు పెట్టుకుంది.ఎప్పుడూ అల్లరి చిల్లరగా తిరిగే బుడుగు బావురుమన్నాడు. అచ్చ తెలుగు కొంటెకోణంగి, ఇక నాకెవరు దిక్కు అంటూ వాపోయింది.

కాలభ్రమణంలో పదేళ్ళు గిర్రున తిరిగిపోయినా... సత్తిరాజు లక్ష్మీనారాయణ... బొమ్మల,సినిమా ప్రపంచానికి



ఆమాట కొస్తే... తెలుగు భాషకు విలక్షణ రాతను నేర్పిన పరిచయం అక్కర్లేని పేరు "బాపు"!

"ముత్యాల ముగ్గులేసి" జరిపించిన "సీతా కళ్యాణం" "సాక్షి"గా... "పెళ్ళిపుస్తకం"తో... "మంత్రిగారి వియ్యంకుడు" ను "తూర్పు వెళ్ళే రైలు" ఎక్కించి... " ఏది ధర్మం ఏది న్యాయం" అంటూ "బుల్లెట్" వర్షాన్ని కురిపించిన "రాజాధి రాజు".

"సంపూర్ణ రామాయణాన్ని" "రామాంజనేయ యుద్ధాన్ని" తెలుగు జాతి సొత్తు గా మలచిన "బుద్ధిమంతుడు".....

" గోరంత దీపం" పెట్టి "బాలరాజు" కథలు చెప్పి, ఆ ముక్కంటినే ప్రసన్నం చేసుకొన్న "భక్త కన్నప్ప".

"వంశవృక్షాన్ని" "పెళ్ళీడు పిల్లలకు" వివరించి, "పండంటి జీవితం"లో అరమరికలు లేని కాపురంతో..."ఇంటి గౌరవాన్ని" ఎలా కాపాడుకోవాలో... చెబుతూనే... స్త్రీ అంటే "బంగారు పిచ్చుక" మాత్రమే కాదు అవసరమైతే..."Mr. పెళ్ళాం" అంటూ వివరించిన విలక్షణ దర్శక మహర్షి.

"హమ్ పాంచ్"... "ప్యారీ బెహన్" "మొహబ్బత్" కోసం... "ఓ సాత్ దిన్" " ప్రేమ్ ప్రతిగ్య" చేయడం "మేరీ ధర్మ్" అంటూ... బాలీవుడ్ "బేజుబాన్".... ఈ "దిల్ జాలా".

"కృష్ణావతారం"లో... రాధా గోపాలానికి" "సుందర కాండను" చెప్పిన అపర "శ్రీనాథ కవి సార్వభౌముడు".

"సీతమ్మ పెళ్ళి" లో.... "అందాల రాముడు" కి... "శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్" లో విడిది ఏర్పాట్లు చేసి, "మన ఊరి పాండవులకు", "కలియుగ రావణాసురునికి", "కళ్యాణ తాంబూలాల"ను ఇచ్చిన "రాంబంటు".

తన అంతరాత్మ రమణ అస్తమయం తర్వాత.... నా "జాకీ" లేని ఈ "శ్రీ రామ రాజ్యం" నాకొద్దు అంటూ... ఆ "స్నేహం" కోసం "పరమాత్మ" లో ఐక్యమైన బాపూరమణీయం.

తరాలు గడచినా... శతాబ్దాలు మారినా... బాపూ గీత, రమణ రాత నిత్యనూతనమే.

**- స్రవంతీచంద్ర**

## వర్షంలోనూ ఎమ్మెల్యే దివ్య పింఛన్లు పంపిణీ

- **అభినందించిన లబ్ధిదారులు**

**డి.పోలవరం, మహానాడు:**
చంద్రబాబు ప్రభుత్వం ఓరోజు ముందే పెన్షన్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తే ఎమ్మెల్యే యనమల దివ్య జడివానలను లెక్క చేయకుండా డి.పోలవరం, కోటనందూరు గ్రామాలకు వెళ్ళి నేతలు యనమల రాజేష్, అంకం రెడ్డి నానబ్బాయి, సర్పంచ్ పలకా సోమేశ్వరరావులతో కలిసి పెన్షన్లను పంపిణి చేశారు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) మండల అధ్యక్షుడు గాడి రాజబాబు అధ్యక్షతన కోటనందూరులో జరిగిన కార్యక్రమంలో పెంటకోట భాస్కర సత్యనారాయణ, లోవ చైర్మన్ గొర్లె అచ్చయ్య నాయుడు, మాజీ ఎంపీపీ దంతులూరి చిరంజీవి రాజు, అంకారెడ్డి రమేష్, పోతల సూరిబాబు, వెలగా వెంకట కృష్ణారావు, బోడపాటి సత్యనారాయణ, అంకారెడ్డి రాజశేషు, ఎర్రా చిన సత్యనారాయణ, ఎల్.ఎస్. అంకారెడ్డి, వెంకటేష్, బంటుపల్లి వెంకటేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున్, వాసం నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాస్, గంటా అమ్మాజీ, మేడపురెడ్డి జోగి బాబు తదితరులు పాల్గొన్నారు.

తుని ఇసుకలపేట్ల కమిషనర్ వెంకట్రావు అధ్యక్షత



జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దివ్య హాజరైయ్యారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, యనమల రాజేష్‌లతో కలిసి ఇసుకలపేటలో దివ్య పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి సత్యనారా యణ, కూటమి నేతలు మల్ల గణేష్, కుక్కడపు బాలాజీ, నార్ల రత్నాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, పరవాడ తాతబాబు, రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

### కొండ ప్రాంతవాసులు
## అప్రమత్తంగా ఉండాలి

- **శాసనసభ్యులు గద్దె రామమోహన్**

**విజయవాడ,మహానాడు:**
విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడుతున్న నేపథ్యంలో కొండ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యులు గద్దె రామమోహన్ కోరారు. శనివారం ఉదయం క్రీస్తురాజపురం సున్నపు బట్టీల సెంటర్ ఏరియాలో కొండ చరియలు పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హుటాహుటిన అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు గద్దె రామమోహన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలలో ఇటువంటి వర్షాలు ఎప్పుడూ పడలేదన్నారు. నిత్యం కురుస్తున్న వర్షాల కారణంగా కొండ చరియలు విరిగి పడి నలుగురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని గద్దె రామమోహన్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో గతంలో అనేక సార్లు చిన్న చిన్న కొండ రాళ్ళు పడిన సందర్భాలు ఉన్నాయి గాని ఇంత పెద్ద కొండచరియ పడి ఈ స్థాయిలో ప్రమాదం జరగడం ఇదే మొదటి సారి అన్నారు.

ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేస్తున్నారని, అలాగే తనతో మాట్లాడి సహాయక కార్యక్రమా లపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారన్నారు. రెస్క్యూ టీమ్ వచ్చి రాళ్ళను తొలగించి కొందరి ప్రాణాలు కాపాడడం జరిగిం దన్నారు. గతంలో కూడా తాను ఈ ప్రాంతంలోని వారికి అనేక



మార్లు మీరు ప్రమాద ప్రాంతంలో ఉంటున్నారని ఖాళీ చేయా లని విన్నవించడం జరిగిందన్నారు. అయినా కూడా ఎప్పటి కప్పుడు కొత్తవారు రావడం జరిగిందన్నారు.

ఇంకా కూడా కొంత మంది తాము ఎంతోకాలం నుంచి ఉంటున్నామని, ఏమి జరగదనే ధైర్యంతో ఉంటున్నారని, ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లోని వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని కోరారు. వారు వెళ్ళని సందర్భంగా ప్రమాదాలను నివారించేందుకు బలవంతంగా అయినా వారిని ఖాళీ చేసి ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా చూస్తామన్నారు. గద్దె రామమోహన్‌తో పాటు డివిజన్ తెదేపా అధ్యక్షులు నందిపాటి దేవానంద్, షేక్.షరీప్, కోడూరు సుబ్రమణ్యం, పటమట సతీష్చంద్ర, దోమకొండ రవి, పెనుగొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సహకార సంఘాల్లో ఎరువుల కృత్రిమ కొరత!

- **రైతుల అవస్థలు**
- **పట్టించుకోని అధికారులు**

**అవనిగడ్డ, మహానాడు:**
అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు సహకార సంఘాల్లో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి రైతాంగాన్ని తీవ్ర అవస్థలకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రైతులకు ఎంతో అవసరమైన ఎరువులను సకాలంలో సక్రమంగా సహకార సంఘాల ద్వారా సరఫరా చేయవలసిన బాధ్యతను కొంతమంది సహకార సంఘాల కార్యదర్శులు విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కొన్ని సహకార సంఘాల నుంచి ఇప్పటికే ఎరు వులు లారీల్లో ప్రైవేటు దుకాణదారులకు చేరిపోయినట్టు అనేక విమర్శలు వెలువడుతున్నాయి. ఇదే సమయంలో ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఎరువుల కొనుగోలు భారంగా మారు తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంతమంది సహకార సంఘాల కార్యదర్శులు ఎరువుల



దుకాణదారులతో చేసుకున్న లోపాయికారి ఒప్పందాల కారణంగా జరుగుతున్న ఈ అక్రమ వ్యవహారాల నేపథ్యంలో రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత కొంతమంది వైసీపీ అనుకూల సహకార సంఘాల కార్యదర్శులు ఈ విధమైన రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.


### ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే
## గర్ల్స్ హాస్టల్‌లో హిడెన్ కెమెరా

- **వైయస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి**

**తాడేపల్లి,మహానాడు:**
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ గర్ల్స్ హాస్టల్‌లో హిడెన్ కెమెరా ఘటన చోటు చేసుకుందని వైయస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రెస్‌మీట్ ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యా రంగం అస్తవ్యస్తం అయిందన్న ఆమె, ఎక్కడికక్కడ పర్యవేక్షణ కొరవడిందని, దీంతో పిల్లలు చాలా కష్టాలు పడుతున్నారని చెప్పారు.

ఇంజనీరింగ్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌లో ఘటన అనైతికం అన్న ఆమె, వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలపై విద్యార్థినిలు ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదని, ఘటన వెలు గులోకి వచ్చినా, ప్రభుత్వం ఏ మాత్రం సక్రమంగా స్పందిం చడం లేదని, అసలు అలాంటిదేమీ లేదంటూ కితాబునివ్వడం అత్యంత హేయమని వరుదు కళ్యాణి ఆక్షేపించారు.

హిడెన్ కెమెరాలపై విద్యార్థినిలు ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం తొలి నుంచి, వారిని కట్టడి చేస్తూ కాలేజీ యాజమాన్యాన్ని రక్షించే ప్రయత్నం చేస్తోందని వరుదు కళ్యాణి మండిపడ్డారు. గత 29వ తేదీన హాస్టల్ వాష్‌రూమ్‌ల్లో షవర్లు రిపేర్ చేస్తుంటే, హిడెన్ కెమెరాలు బయట పడ్డాయని, వాటిపై ఫిర్యాదు అందినా, ఏ మాత్రం దర్యాప్తు చేయని పోలీసులు, అక్కడ అలాంటిదేమీ లేదని 30వ తేదీన ప్రకటించారని ఆమె




గుర్తు చేశారు.


నిజానికి ఈ వ్యవహారంలో విద్యార్థినిల సమక్షంలో విచారణ జరగాల్సి ఉండగా, వారందరినీ బలవంతంగా ఇళ్లకు పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరకు తమను కూడా హాస్టల్‌లోకి అనుమతించక పోవడాన్ని వరుదు కళ్యాణి తప్పు బట్టారు. ప్రభుత్వ వైఖరిని నిలదీసిన ఆమె, ఇకనైనా ఇలాంటి సంఘటలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

ఈ మొత్తం ఘటనకు కారణమైన విద్యార్ధి తన సోషల్ మీడియా అకౌంట్లో పవన్ కళ్యాన్ ఫోటోలు ఉంటే, వాటిని మార్ఫింగ్ చేసి తమ పార్టీపై నెట్టే ప్రయత్నం చేశారని కళ్యాణి ఆగ్రహించారు. ఆ విద్యార్థినిలకు న్యాయం జరిగే వరకు పోరాడతామని వరుదు కళ్యాణి ప్రకటించారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024



అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండలం సంతరి పంచాయతీ సంతరి గ్రామంలో టీడీపీ కూటమి మండల అధ్యక్షుడు కొర్ర తులసిరావు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



## మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడుకుందాం!

◆ ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు

తిరుపతి, మహానాడు:

తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని తుడా మైదానం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఇందులో భాగంగా అందరం మట్టి విగ్రహాలను వినాయక చవితి పండగకు వినియోగించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నేత, పూజా కమిటీ సభ్యుడు నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అనేక ఏళ్ళుగా వినాయక చవితి పర్వదినాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో, స్థానిక మండప నిర్వాహకుల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం విఘ్నేశ్వరుని ఆశీస్సులతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని విఘ్నాలు తొలగిపోయి విజయ పథంలో దూసుకెళ్ళాలని, చవితి పండగ ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ముంబయి నటి కేసులో దోషుల అరెస్టుపై కాలాతీతం వద్దు

◆ అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు బాలకోటయ్య

అమరావతి, మహానాడు:



రాష్ట్ర పరువును, ఐపిఎస్ గౌరవాన్ని తీసి ముంబయి నటిపై హిడింబి లా ప్రవర్తించిన ముగ్గురు ఐపిఎస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంలో ఆలస్యం, కాలాతీతం సరైనది కాదని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు పోతుల బాలకోటయ్య వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఈ దుర్మార్గమైన వ్యవహారంలో ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయమే.. ఐనా చర్యలు తీసుకుంటేనే చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ లో మార్పు వస్తుందన్నారు. సోషల్ మీడియాలో నటి పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్య హింసను కాపాడేందుకు కొందరు పనికిమాలిన ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మహిళలు బాధితురాలైన నటికి అండగా ఉండాలని బాలకోటయ్య కోరారు.

## లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టండి

◆ అధికారులకు మంత్రి సత్యప్రసాద్ ఆదేశాలు

మరావతి, మహానాడు:

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. అత్యవసరం అయితే తప్పించి ఎవరూ బయటకు రావొద్దు. జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడకుండా రెవెన్యూ, యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడిన చోట్ల తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఉద్ధృతంగా ప్రవహించే వాగుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. పలు చోట్ల విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అలర్ట్ గా ఉండాలి.




గ్రామాల్లో పారిశుద్ధ కార్యక్రమాలు వేగవంతం చేయాలి. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలి. అలాగే ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న ప్రాంతాల్లో చెరువులు నిండుతాయి. అలాంటి చోట్ల నీటిపారుదల శాఖ అధికారులు చెరువులను నిత్యం పర్యవేక్షించాలి. అవసరమైతే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి. అలాగే పెన్షన్ పంపిణీ సమయంలో ఎటువంటి ప్రమాదాలకు గురవకుండా రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించాలి. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయడంతో పాటు ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్ళినవారు జాగ్రత్తగా తీరం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

## ఆ అమ్మాయిని గుట్టుగా ఇంటికి పంపించేశారు...

◆ 'గుడ్లవల్లేరు' ఘటనలో యాజమాన్యం తీరు

గుడ్లవల్లేరు, మహానాడు:



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ సీక్రెట్ కెమెరా ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అమ్మాయిని గుట్టుచప్పుడు కాకుండా కాలేజీ యాజమాన్యం ఇంటికి పంపించింది. గుడ్లవల్లేరు కాలేజీలో రహస్య కెమెరాలు అమర్చి, యువతుల అభ్యంతరకర దృశ్యాలు రికార్డు చేయడానికి తోడ్పాటు అందించిందని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అమ్మాయిని కళాశాల యాజమాన్యం ఇంటికి పంపించడంపై తోటి విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణ పూర్తికాకముందే...ఆ యువతిని ఘటనా స్థలం నుంచి తప్పించడంపై సహ విద్యార్థనులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## ముంపు ప్రాంతాలు దేవినేని ఉమా పరిశీలన

విజయవాడ రూరల్,మహానాడు:

విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ముంపు ప్రాంతాలను మాజీ మంత్రి దేవినేని ఉమా శనివారం పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన,




సారా కొట్టు సెంటర్ ప్రాంతంలో పర్యటించారు. తుపాను ప్రభావం దృష్ట్యా ఎన్డీయే నేతలతో కలిసి జలమయ ప్రాంతాలలో బాధితుల ఇబ్బందులు తెలుసుకొని సహాయ చర్యలు చేపట్టారు.

## ఏకీకృత పెన్షన్ విధానానికి అనుమతి ఇవ్వద్దు

◆ ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ కు ఉద్యోగుల జే.ఏ.సీ. ప్రతినిధుల అభ్యర్థన

హైదరాబాద్, మహానాడు:

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డితో ఉద్యోగుల జే.ఏ.సీ. ప్రతినిధులు భేటీ అయ్యారు. శనివారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో ఉద్యోగుల జే ఏ సి చైర్మన్ వి. లచ్చిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధుల బృందం చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వవద్దని, 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర



ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్లచ్చిరెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డిని కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడాలని లచ్చిరెడ్డి కోరగా అందుకు చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల పెన్షన్ విషయంలో త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వాస్తవ పరిస్థితులను వివరిస్తానని చిన్నారెడ్డి జే ఏ సి ప్రతినిధి బృందానికి హామీనిచ్చారు. ఉద్యోగుల పెన్షన్ విషయంలో ముఖ్యమంత్రి కి ఇప్పటికే స్పష్టత ఉందని, త్వరలోనే తగిన నిర్ణయం జరుగుతుందని చిన్నారెడ్డి తెలిపారు. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, ఉద్యోగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. పెన్షన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలుస్తుందని చిన్నారెడ్డి తెలిపారు. కేంద్ర రాష్ట్ర గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలకు ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని చిన్నారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని, ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

## ఏపీలో మహిళలకు రక్షణ కరవు

◆ మాజీ మంత్రి రోజా ఆరోపణ

తిరుమల, మహానాడు:



ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు రక్షణ కరవైందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. ఈ మేరకు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాలేజీ బాత్రూంల్లో కెమెరాలు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు.. నేరస్తులకు ఇంత ధైర్యం వచ్చిందంటే ప్రభుత్వం సిగ్గుపడాలి.. గుడ్లవల్లేరులో ఏం జరగలేదని ఎస్పీ చెప్పడం దురదృష్టకరం..

### జగన్ పాలనలో తప్పు చేయాలంటే భయపడేవాళ్ళు...

ముచ్చుమర్రిలో 9 ఏళ్ల అమ్మాయిని రేప్ చేసి చంపేస్తే న్యాయం చేయలేదు.. ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు సీఎం, హోంమంత్రి ఎందుకు వెళ్ళలేదు.. నేను ఏ పార్టీ మారడం లేదు.. పార్టీ మారుతున్న వారు ఒకసారి పునరాలోచించుకోవాలి.. 2014-19 మధ్యలో కూడా చాలా మంది పార్టీ మారారు.. పార్టీ మారడం వల్ల జగన్ కు, వైసీపీకి ఎలాంటి నష్టం ఉండదు. పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరు.

## హైడ్రా పేరిట పేదల ఇళ్ళు కూల్చివేత అన్యాయం!

◆ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు:



హైడ్రా పేరుతో ప్రభుత్వం సెలెక్టెడ్ దాడులు చేస్తోందని, పాలమూరులో పేదల ఇళ్ళు కూల్చివేత అన్యాయమని, బయటకు అక్రమ నిర్మాణాలన్నీ కూల్చుతాం అని చెబుతున్నా... తీసుకుంటున్న చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. హైడ్రా కార్యాలయమే అలుగులో ఉందని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ పార్క్ ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఉన్నాయి.... ఏవి సరిదిద్ద గలం? ఏవి సరిదిద్దలేం? అన్న విచక్షణ లేకుండా తీసుకుంటున్న ప్రభుత్వ చర్యల వల్ల ప్రజలు బాధితులు అవుతున్నారు... పాలమూరులో 75 మంది దివ్యాంగులు, దళితులైన పేదల ఇళ్ళు కూల్చడం దుర్మార్గం.. ఇళ్ళ కూల్చివేతలో డ్యూ ప్రాసెస్ ఆఫ్ లాను ప్రభుత్వం పాటించలేదు... రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ళు అని చెప్పి హామీ ఇచ్చారు. తొమ్మిది నెలలైనా రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు .. పాలమూరులో పేదల ఇళ్ళు కూల్చేశారు.... ఆ నిర్మాణాలు అక్రమం అయితే వారికి ప్రత్యామ్నాయం చూపించకుండా ఎలా కూలుస్తారు? కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్నదానికి పూర్తి విరుద్ధంగా ఉంది. రైతుభరోసా రూ.15 వేలు అన్నారు .. రైతుబంధు రూ.10 వేలకే దిక్కులేదు...


రూ.4 వేల ఆసరా పింఛన్ అన్నారు .. రూ.2 వేల ఫించన్లకే దిక్కులేదు... గురుకులాల విద్యార్థులే కాదు .. గురుకులాల ఉపాధ్యాయులు కూడా నేడు రోడ్డెక్కారు.. రాష్ట్రంలో 9 ఏండ్లుగా లేని ఉద్యోగుల జేఏసీ కాంగ్రెస్ 9 నెలల పాలనలో ఏర్పడింది. అందరికీ రుణమాఫీ అని కొందరికే చేయడంతో రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కారు.. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అని ఓట్లు దండకుని నిరుద్యోగులు, విద్యార్థులకు టోకరా పెట్టారు..

## వరదలో కొట్టుకుపోయిన కారు, ముగ్గురి మృతి

◆ గుంటూరు జిల్లాలో విషాదం

గుంటూరు, మహానాడు:

వరదలో ఓ కారు కొట్టుకుపోవడంతో అందులో ఉన్న ముగ్గురు మృతి చెందారు. దీంతో గుంటూరు జిల్లాలో విషాదం నెలకొంది. శనివారం పెదకాకాని మండలం ఉప్పలపాడు- గోళ్లమూడి మధ్య వరద ఉద్ధృతికి కాలువలో కారు కొట్టుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న టీచర్ రాఘవేంద్ర, పిల్లలు సాత్విక్, మాన్విక్ మృతి చెందారు. వీవీఐటీ - వీవా స్కూల్ నుంచి ఇంటికి వస్తుండగా










ఈ ప్రమాదం సంభవించింది. మృతుల కుటుంబాలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇదిలా వుండగా, మంగళగిరి గండాలయ్యపేటలో కొండచరియలు విరిగిపడటంతో పక్క ఇంట్లో ఉన్న నాగరత్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024





## కొండచరియల బాధితులకు ఆర్థిక సాయం పంపిణీ

◆ మంత్రి నారాయణ

**విజయవాడ, మహానాడు:**
కొండచరియలు విరిగిపడి కొత్త ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, వీఎంసీ కమిషనర్ ధ్యాన చంద్ర శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయవాడలో ఈరోజు జరిగిన ఘటన దురదృష్టకరం. ఐదుగురు వ్యక్తులు మృతి



చెందడం చాలా దురదృష్టకరం. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఇవాళ ఉదయం నుంచీ సీఎం ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూనే ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే విజయవాడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాం.
పనులు వేగంగా జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. గత ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను



నిలిపివేసింది. తిరిగి పనులు పూర్తి చేయడానికి 200 కోట్లు ఖర్చవుతుంది. వెంటనే పనులు ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మిస్తాం. మృతుల కుటుంబ సభ్యులకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ తరఫున ఐదు లక్షల ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేసినట్టు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె,క మిషనర్ ధ్యాన చంద్ర తెలిపారు.

## మూడు వారాల్లో పరిష్కరిస్తాం...

◆ పోస్టల్ జీడీఎస్ ఎంప్లాయిస్ ఉద్యోగోన్నతిపై పెమ్మసాని హామీ

**గుంటూరు, మహానాడు:**
పోస్టల్ శాఖలో జీడీఎస్(గ్రామీణ డాక్ సేవక్) ఎంప్లాయిస్ ఉద్యోగోన్నతి సమస్యను మూడు వారాల్లో పరిష్కరిస్తామని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. పులివెందుల నుంచి వచ్చిన పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు గుంటూరులోని స్థానిక ఎంపీ కార్యాలయంలో పెమ్మసానిని శనివారం కలిసి తమ సమస్యను వివరించారు.
పోస్టల్ శాఖలో గ్రామీణ డాక్ సేవక్‌లుగా పని చేస్తూ ఉద్యోగోన్నతి కోసం 2022 మరియు2023 సంవత్సరాల్లో 2 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాశారని, అయితే ఏపీలో ఖాళీలు లేనందున తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని తెలిపారు. ఢిల్లీలో 3600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు 11



నెలల క్రితం వినతిపత్రం అందించామని, అయినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని పెమ్మసాని దృష్టికి ఈ సందర్భంగా తీసుకొచ్చారు. సమస్యపై పెమ్మసాని స్పందిస్తూ ఢిల్లీ అధికారులతో చర్చించి మూడు వారాల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

◆ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు, మహానాడు:**
గత 24 గంటలుగా ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే



నసీర్ అన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ళ నుండి బయటకు రావద్దని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండా లని, గోరువెచ్చని నీరు తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు భుజించాలని అన్నారు. కూలిపోయే పరిస్థితిలో ఉన్న ఇళ్లల్లో ఉండద్దని అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ ,విద్యుత్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు అందరితో సమావేశం నిర్వహించారు.
ఆంధ్ర ముస్లిం కాలేజ్, యాదవ్ హైస్కూల్, పాత గుంటూరు, గవర్నమెంట్ హై స్కూల్, లీలా మహల్ ఎదురు, బుర్ర నాగేశ్వరరావు హై స్కూల్ ఆర్టీసీ కాలనీ, అంజుమన్ హై స్కూల్, పొన్నూరు రోడ్, పినపాక ప్రభుదాస్ హై స్కూల్, సంజీవయ్య నగర్, వినోబానగర్ హై స్కూల్, నందివెలుగు రోడ్‌లలో పునరావస కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేయవలసినదిగా అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఈ పునరావస కేంద్రాల్లో తలదాచుకోవాలని కోరారు.

## వర్షానికి నీట మునిగిన బాలికల హాస్టల్!

◆ 120 మంది విద్యార్థినుల తరలింపు

**గుంటూరు, మహానాడు:**
ఎడతెరిపిలేని వర్షం కారణంగా స్థానిక ఆర్ ఆర్ నగర్ లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల హాస్టల్ నీట మునిగింది. దీంతో అధికారులు తగు చర్యలు చేపట్టారు. ఆర్ఆర్ నగర్‌లోని రెసిడెన్షియల్ స్కూల్ కమ్ హాస్టల్ లోకి భారీగా వచ్చి చేరిన వర్షపు నీరు వల్ల విద్యార్థినీలు చదువుకునే, పడుకునే గదుల్లోకి కూడా వర్షపు నీరు చేరింది. పిల్లల పుస్తకాలు, బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు నీటమునిగి తేలియాడుతున్నాయి. దీంతో అధికారులు 120 మందికి పైగా విద్యార్థినీలను పక్కనే ఉన్న మున్సిపల్ స్కూల్ కు తరలించారు. 2016 లో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. చుట్టుపక్కల రోడ్లు ఇతర ఇల్లు మేరకపై ఉండటం, భవనంపల్లంగా ఉండటంతో వర్షం పడిన ప్రతిసారి ఆ నీరు హాస్టల్లోకి చేరి జలాశయాలను తలపిస్తాయని వార్డెన్ తెలిపారు. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 5 ఎకరాలు స్థలం కేటాయించాలని పలుమార్లు తామంతా విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. 120 మంది విద్యార్థులు ఉండగా వర్షం వచ్చినప్పుడు ఇక్కడి దుస్థితిని చూసిన తల్లిదండ్రులు పలువురిని టీసీలు తీసుకొని వేరే స్కూల్లో జాయిన్ చేసేందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు.

## గుడ్లవల్లేరు ఘటన విచారణపై
# సీఎం చంద్రబాబు సమీక్ష

◆ జిల్లా కలెక్టర్, ఎస్పీ, విచారణ అధికారులు, జెఎన్టియు విసి, సైబర్ నిపుణలతో సమీక్షించిన సిఎం
◆ విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు. తప్పు జరిగిందని తేలితే బాధ్యులను వదలం
◆ ఆడబిడ్డల రక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. సైబర్ నిపుణులతో లోతుగా దర్యాప్తు
◆ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి,**
కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో హిడెన్ కెమేరాలు పెట్టారనే అంశంలో జరుగుతోన్న విచారణపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. ఘటన వెలుగు చూసిన తరువాత ఎస్పీ, కలెక్టర్ ను నిన్న కళాశాలకు పంపిన ముఖ్యమంత్రి...అప్పటి నుంచి విచారణ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.
వందల మంది విద్యార్థినులకు సంబంధించిన అంశం కావడంతో ఘటనను సీఎం సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై కేసు రిజిస్టర్ అయిన అనంతరం జరుగుతున్న విచారణపై సిఎం రివ్యూ చేశారు. ఇప్పటి వరకు విచారణలో సాధించిన పురోగతిపై అధికారులతో చర్చించారు. విద్యార్థినులు చెప్పే అంశాల ఆధారంగా లోతుగా, అన్ని కోణాల్లో విచారణ జరపాలన్నారు. ఇప్పటి వరకు జరిపిన పరిశీలనలో హిడెన్ కెమేరాలు ఏవీ దొరకలేదని అధికారులు చెప్పగా...మరింత లోతుగా విచారణ జరపాలన్నారు.
అనుమానితుల ఫోన్లు, ల్యాప్ ట్యాప్ లను సైబర్ నిపుణుల ద్వారా పరిశీలించాలన్నారు. డాటా తొలగించే అవకాశాన్ని కూడా పరిగణలోకి తీసుకుని టెక్నికల్‌గా ఉన్న అన్ని వనరు లను ఉపయోగించుకోవాలన్నారు. ఆడబిడ్డల భద్రత, మహిళల వ్యక్తిగత గోప్యత విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా సైబర్ సెక్యూరిటీ నిపుణుల ఆధ్వర్యంలో డీ బగ్గింగ్ డివైసెస్‌తో అన్ని చోట్లా తనిఖీలు చేపట్టే విషయాన్ని పరిశీలించాలని ఆదేశించారు.
నేరం జరిగిందా లేదా అనేది పూర్తి విచారణ తరువాతనే తేలుతుందని....తప్పు జరిగిందని తేలితే మాత్రం నిందితులను వదలేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో విద్యార్థినుల మనోభావాలను గౌరవించాలని సిఎం సూచించారు. వారి ఆవేదన అర్థం చేసుకుని విచారణ చేయాలని సూచించారు. చదువుకునే ఆడబిడ్డలకు ఇలాంటి వివాదం తలెత్తితే మానసికంగా తీవ్ర ఆందోళన చెందుతారని...వారికి, వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు.
ఎవరి దగ్గరైనా ఘటనకు సంబంధించి అదనపు సమాచారం, ఆధారాలు ఉంటే నేరుగా తనకే పంపాలని సిఎం కోరారు. ఇదే సమయంలో కొందరు ఈ ఘటనను ఆధారంగా చేసుకుని విద్యార్థులను మరింత భయపెట్టేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని....అలాంటి వారి చర్యలను అడ్డుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. సున్నితమైన అంశాల విషయంలో తప్పుడు ప్రచారం మరింత నష్టం చేస్తుందని సిఎం అన్నారు.
ఎప్పటికప్పుడు విచారణ వివరాలు తనకు చెప్పాలని.... ఘటనలో తప్పు ఉందని తేలితే మాత్రం ఎవరినీ ఉపేక్షించేది ఉండదని సిఎం స్పష్టం చేశారు. తిరిగి విద్యార్థినులు ప్రశాంతంగా చదువు కొనసాగించే పరిస్థితి కల్పించాలని సిఎం అధికారులను ఆదేశించారు.

## సత్తెనపల్లి అభివృద్ధికి అన్ని విధాలుగా
# సహకరిస్తా

◆ ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, మహానాడు:**
అభివృద్ధికి చిరునామాగా సత్తెనపల్లి రూపు రేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మున్సిపల్ సమావేశానికి హాజరు ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలు, గెలిచాక అందరితో కలిసి పట్టణ అభివృద్ధికి కలిసి నడుచుకోవాలని కౌన్సిల్ సభ్యులకు సూచించారు.



అజెండాలో 31అంశాలు అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం పెట్టిందన్నారు. సత్తెనపల్లికి అవసరమైన నిధులు నా ద్వారా, సహచర మంత్రులు దృష్టికి తీసుకువెళ్ళి నిధులు సమకూరుస్తానన్నారు.
ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న మున్సిపల్ అధికారులు, చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.




## పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

◆ ఎస్పీ సతీష్ కుమార్

**గుంటూరు, మహానాడు:**
జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టర్ ఆఫీసులో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫోన్ నెంబర్ 0863 2234014 నెంబర్ కు ఫోన్ చేసి సమస్యను తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునని ప్రజలకు సూచించారు. ఈ ప్రత్యేక కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు.

## తల్లితో కలసి శ్రీకృష్ణ మఠాన్ని దర్శించిన ఎన్టీఆర్

● ఇది కృష్ణుడి స్క్రీన్ ప్లే
● దేవుడు ఇచ్చిన స్నేహితుడు రిషబ్ శెట్టి
● మనశ్శాంతి కోరుకున్నా: ఎన్టీఆర్
● ఎన్టీఆర్ తల్లి శాలినికి రిషబ్ శెట్టి పాదాభివందనం

**కర్ణాటక,**
జూనియర్ ఎన్టీఆర్ తన తల్లితో కలిసి కర్ణాటకలోని కుందాపుర విచ్చేశారు. కుందాపుర ఎన్టీఆర్ అమ్మమ్మ గారి ఊరు. తల్లి కోరిక మేరకు కుందాపుర వచ్చిన ఎన్టీఆర్... ఉడుపి జిల్లాలోని శ్రీకృష్ణ మఠ ఆలయాన్ని దర్శించారు.
కన్నడ స్టార్ హీరో, కాంతార ఫేమ్ రిషబ్ శెట్టితో కలిసి ఎన్టీఆర్ మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా ఎన్టీఆర్ ను స్థానిక మీడియా ప్రతినిధులు కన్నడ భాషలో ప్రశ్నలు అడగ్గా... ఆయన పూర్తిగా కన్నడలోనే బదులివ్వడం విశేషం.దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తెలుగును ఎంత అలవోకగా మాట్లాడతారో, అదే రీతిలో ఎన్టీఆర్ కన్నడ భాషను మాట్లాడడం విశేషం.
కాగా, ఎప్పటి నుంచి కుందాపుర, ఉడుపి రావాలనుకుంటుంటే, ఇన్నాళ్లకు కుదిరిందని తెలిపారు. తన తల్లి 40 ఏళ్లుగా ఉడుపి ఆలయాన్ని సందర్శించాలని కోరుకుంటోందని, ఇవాళ వచ్చామని, ఇది కృష్ణుడి స్క్రీన్ ప్లే అని ఎన్టీఆర్ చమత్కరించారు.
ఈ పర్యటనలో తమ వెంట తనకు ఎంతో ఇష్టమైన



స్నేహితుడు, దేవుడు ఇచ్చిన స్నేహితుడు రిషబ్ శెట్టి ఉండడం ఎంతో సంతోషదాయకం అని పేర్కొన్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ కూడా తమ వెంట ఉన్నారని వెల్లడించారు. కుందాపుర తన తల్లి పూర్వీకుల గ్రామం అని తెలిపారు.
దేవుడ్ని ఏం కోరుకున్నారని ఓ విలేకరి ప్రశ్నించగా... మనశ్శాంతి కోరుకున్నానని జవాబివ్వగానే అందరూ నవ్వేశారు.సర్వే జనా సుఖినోభవంతు అనేది తన నినాదం అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. కాగా, ఇవాళ బెంగళూరు ఎయిర్ పోర్టులో ఎన్టీఆర్ కు రిషబ్ శెట్టి హార్దిక స్వాగతం పలికారు. ఎన్టీఆర్ తల్లి శాలినికి రిషబ్ శెట్టి పాదాభివందనం చేశారు.

11
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024

# సహాయక చర్యల్లో అలసత్వం వద్దు

(మొదటిపేజీ తరువాయి..)
విడుదల చేయాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎనిమిది మంది మృతి చెందినట్టు సీఎంకు అధికారులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రటించారు. ఆదివారం కూడా భారీ వర్షాలు ఉంటాయన్న సమాచారం నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ విభాగం పూర్తి అప్రమత్తతో ఉండాలని కోరారు. శ్రీకాకుళం నుంచి విశాఖ మధ్య శనివారం రాత్రి తుపాను తీరం దాటుతుందని అంచనా ఉండడంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆయా జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తతో ఉండాలని ఆదేశించారు. రాత్రి అంతా మెలుకువతో ఉండి అయినా సరే ప్రజల రక్షణ కోసం పని చేద్దామన్న సీఎం అన్నారు. తుపాను తీరం దాటే సమయంలో 55 నుంచి 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గాలుల వేగంపై స్పష్టమైన అంచనాలతో సన్నద్ధంగా ఉండాలని, ఇప్పుడు తుపాను ఎంత వేగంతో ప్రయాణిస్తుంది.... ఎటువైపు వెళుతుంది అనే విషయాన్ని విశ్లేషించి అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. నష్టం జరిగిన తరువాత స్పందించడం కాదు.... నష్టం తగ్గించేలా అధికారుల పనితీరు ఉండాలని చంద్రబాబు కోరారు. హుద్ హుద్ తుపాను సమయంలో అనుసరించిన బెస్ట్ ప్రాక్టీసెస్ ను పాటించాలని అధికారులకు సూచించారు.

### టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులు, ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు

- వర్షాలు తగ్గేవరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.
- కొన్ని చోట్ల 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం పడింది. ఆదివారం కూడా వర్షాలు పడతాయని తెలుస్తోంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.
- భారీ వర్షాలు ఉన్న జిల్లాల్లో సహాయక చర్యల కోసం జిల్లాకు రూ.3 కోట్లు.... కాస్త తక్కువ ప్రభావం ఉన్న జిల్లాలకు రూ. 2 కోట్లు చొప్పున నిధుల విడుదల చేస్తున్నాం.
- పట్టణ ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో అధికారులు తక్షణ చర్యలకు దిగాల్సిన అవసరం ఉంది.
- ప్రొక్లయినర్లు పెట్టి నీటి ప్రవాహాలకు ఉన్న అడ్డంకులను తొలగించాలి.
- నీటి ప్రవాహాలకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన తొలగించి నీరు బయటకు వెళ్లేలా చూడాలి.
- ఓపెన్ డ్రైన్స్ లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేయండి. అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలి.
- బుడమేరులో నీటి ఉద్ధృతి తీవ్రంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు సీఎంకు తెలిపారు. బుడమేరు ఆక్రమణ వల్ల వరద సమయంలో సమస్యలు వస్తున్నాయని అధికారులు వివరించడంతో .సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రణాళిక వేయాలని సీఎం సూచించారు.
- వరద ప్రాంతాల్లో, వాగులపై వాహనదారులను అనుమతి వద్దు. ఈ విషయంలో కఠినంగా నిబంధనలు అమలు చేయండి.
- ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న వంతెనలపై రాకపోకలు నిలిపివేయండి.
- భారీ వర్షాలు, గాలుల వల్ల తీగలు తెగి విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కరెంట్ సమస్యలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు స్పందించాలి.
- కనకదుర్గ టెంపుల్‌లో ప్రమాదం విచారకరం. భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోండి
- కొండ ప్రాంతాల్లో ఉన్నవారిని అవసరం అయితే ఖాళీ చేయించండి. ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటించాలి.
- సైక్లోన్ షెల్టర్స్‌ను సిద్ధం చేసి పునరావాసం కోసం ఏర్పాట్లు చేయండి
- గర్భిణుల వివరాలు సేకరించి. అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉండండి
- మీడియా, సోషల్ మీడియా ద్వారా, ప్రభుత్వ శాఖల ద్వారా క్షణక్షణం ప్రతి సమాచారాన్ని తెలుసుకుంటున్నా.. అధికారుల అలసత్వం కనిపిస్తే సహించేది లేదు.
- భారీ వర్షాలు ఉన్న జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలి. ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి.
- వాతావరణ శాఖ ఇచ్చే సమాచారం ఆధారంగా ముందు రోజే సెలవుపై ప్రకటన చేయాలి
- ప్రమాదం జరిగిన తరువాత ప్రభుత్వం సహాయం చేయడం కాదు....ప్రమాదం జరగకుండా చూడడం పై యంత్రాంగం దృష్టిపెట్టాలి
- భారీ వర్షాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాను... అధికారులు కూడా వాట్స్ యాప్ గ్రూపుల ద్వారా సమాచారం తెప్పించుకుని వేగంగా స్పందించాలి
- అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్న ఘటన జరిగినా సహించేది లేదు. విపత్తు సమయంలో ప్రజలకు అండగా నిలవాలి
- హుద్ హుద్ తుపాను సమయంలో అనుసరించిన విధానాలను కలెక్టర్లు స్టడీ చేయాలి. నాడు తీసుకున్న పటిష్ఠ, ముందస్తు చర్యల ద్వారా ప్రాణ నష్టం లేకుండా చేశాం.
- ఆ విధానాలను స్టడీ చేసి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

# జనమూ జలమూ ఆయన బలం

(మొదటిపేజీ తరువాయి..)
యన్టీఆర్‌ని తలవకుండా.. రాజకీయాలు ఉండవు..! తెలుగు వారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్ మరణం తర్వాత, ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగు జాడల్లో నడుస్తూ నేటి భవిష్యత్ తరానికి భరోసా కల్పిస్తున్న నాయకుడు చంద్రబాబు.


తెలుగు రాష్ట్రాలు..సైబరాబాదు అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర..భాగస్వామ్యం కాదనలేని..నిరూపిత సత్యం.ఆయన ప్రస్తావన లేని సందర్భమే ఉండదు.

అతను ఒకే ఒక్కడు..!

ఆ ఒక్కడి చుట్టూ రాజకీయాలు తిరుగుతుంటాయి.

కలలో ఇలలో చంద్రబాబు మీకు కొరకలేని కొయ్య.

కంటిలోని నలుసు..చెప్పులోని రాయి..చెవిలోని జోరీగ.. నరంమీద కురుపు.



అలా మీరు భావించారు కాబట్టే..ఆయన మీద పడి..ఆనాటి నుండి ఈనాటి వరకు ఒకటే బూతుల భాష..వేధింపు..వెక్కిరింత.

చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యేనాటి పరిస్థితి..

జీతాలు ఇవ్వలేని..కరెంటు కష్టాలతో..కరువు విలయ తాండవం చేస్తున్నది. తీవ్ర వర్షా భావం.

ముందుచూపుతో విద్యుత్ సంస్కరణలు..!ఐటీ అభివృద్ధి.. రోడ్లవిస్తరణ..జన్మభూమి. ఈ సేవ.. రైతుబజార్లు..! ఇంకుడు గుంతలు. ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా అవహేళన చేశారు.

సాధారణంగా మార్పుని ముందు వ్యతిరేకిస్తారు.

తర్వాత విమర్శిస్తారు.

చివరకు ఆహ్వానిస్తారు..ఆచరిస్తారు.

ఆయన ఆరోజు ప్రారంభించిన ఏ కార్యక్రమం అయినా పేర్లు మార్చి, ఈ రోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి

అందుకే ఆయనని విజనరీ లీడర్ అంటారు.

ఉద్యమసమయంలో..అందరి గురి తనమీద ఉన్నా..తననే లక్ష్యం చేసుకుని విమర్శల దాడి చేసినా..అడుగడుగునా పర్యటనలు అడ్డుకున్నా..నిబ్బరంగా..నిశ్చలంగా..రెండు ప్రాంతాలు రెండుకళ్ళని ప్రకటించగలిగారు.హేళన చేసిన నోళ్ళు ఇపుడు అదే మాట..అదే పాట పాడుతున్నారు.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత మొదటి ఎన్నికలలో.. గణనీయమైన ఓట్లు..సీట్లు సాధించిన పార్టీ. గెలిచిన వారు ఒక్కొక్కరు విడిచి వెళితే స్థితప్రజ్ఞత ప్రదర్శించి..సమయం వచ్చినపుడు రాజకీయ ప్రత్యర్దుల కి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ప్రత్యర్దుల్ని చేరదీసి..మిత్రుల్ని విడదీసి..కాళ్ళకు కట్టెలడ్డం పెట్టినా..విసుగు విరామం లేకుండా తనపని తను చేసుకు పోయాడు చూడు..!

ఏ పేరు చెబితే ఉస్మానియా భగ్గుమంటుందో..ఏ పేరు చెబితే ఉస్మానియా రగిలిపోతుందో..అదే ఉస్మానియా విద్యార్ధులు ఇవాళ ఆయన గురించి తలచుకుంటున్నారు.

రైతులికి మీరు బేడీలు వేస్తే..ఆయన పూలదండలు వేయించుకున్నారు..గిట్టుబాటు ధరలు ప్రకటించారు.. నీరిచ్చాడు..కరువుని జయించాడు..రుణమాఫీ చేసాడు..

ఒక ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చిన రైతుల్ని సంతృప్తి పరచలేక లాఠీలు విరొగ్గట్టారు ఇతరులు.. రాజధాని



నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చులేకుండా..ఒక్క లాఠీ విరగకుండా..రైతుల్ని ఒప్పించి మెప్పించి ముప్పై మూడువేల ఎకరాలు సేకరించాడు..! రాబోయే రోజుల్లో అమరావతిని ఒక గొప్ప మహా రాజధానిగా తీర్చిదిద్దే గొప్ప స్వపన్నికుడు చంద్రబాబు.

సైకో జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలో చంద్రబాబుని జైల్లో పెట్టిన కూడా ఎక్కడ బెదరకుండా, ఇంకా రెట్టింపు ఉత్సాహం కూటమిని ఏర్పాటు చేసి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి జనరంజక పరిపాలన చేస్తున్న ధీరుడు చంద్రబాబు.

ఆయన మీద ఈర్ష్యా ద్వేషం పగ ప్రతీకారాలతో రగిలి పోతున్నారు మీరు. ఆయన రాగద్వేషాలకు అతీతంగా దూషణభూషణ తిరస్కారాలకు అతీతంగా తనపని తాను చేసుకుపోయాడు.

ఆయన నిత్యం ప్రజల్లో ఉంటూనే ఉన్నాడు. సమస్య కంటే ముందు పరిష్కారంతో ఎదురెళుతున్నాడు. ఏ రోజు కూడా బాధ్యత మరచి ఇంట్లో తొంగోలేదు.ఆయనకి ప్రజలే ముందు.

జనమూ జలమూ ఆయన బలం.

ఆయన తెలుగు రాష్ట్రాలకే కాదు దేశానికే ఆదర్శవంతమైన నాయకుడు.

చరిత్రలో నిరూపించుకున్నారు.

భవిష్యత్తులో నిరూపించబడుతుంది.

# సీఎంగా చంద్రబాబు... నేటికి 30 ఏళ్ళు!

- సంబరాలకు సిద్ధమైన నేతలు
- కేంద్ర, జిల్లా కార్యాలయాల్లో బాబు ఫోటోలతో ఎగ్జిబిషన్ లు
- విజన్ ఉన్న నేత.. నవ్యాంధ్ర నిర్మాణ ప్రదాత
- బాబుతోనే ఏపీ పునర్నిర్మాణం సాధ్యం
- మచ్చలేని చంద్రుడిని పక్క రాష్టాలు అనుసరిస్తున్నాయి
- ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రి ఆలపాటి, బుచ్చి రాంప్రసాద్

మంగళగిరి, మహానాడు:
నారా చంద్రబాబు నాయుడు మొదటిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి నేటి(సెప్టెంబర్ 1)కి 30 ఏళ్ళు నిండుతున్నాయని ఆయన సేవలను కొనియాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చంద్రబాబు లాంటి నాయకుడు రాష్ట్ర ప్రజలకు దొరకడం అదృష్టమని నేతలు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వినర్ బుచ్చి రాంప్రసాద్ లు పేర్కొన్నారు. మంగళగిరి తెలుగుదేశం




పార్టీ(టీడీపీ) టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

### తెలుగు జాతి గర్వించదగిన రోజు

1995సెప్టెంబర్ 1 యావత్ తెలుగు జాతి గర్వించదగిన రోజు... రాష్ట్ర ప్రయోజనాల కోసం దేశంలో ప్రజాస్వామ్యం కాపాడటానికి సమాజాన్ని రక్షించడానికి చంద్రబాబు ప్రమాణస్వీకారం

చేసిన రోజు అది. అనాటి నుండి ఈరోజుకు ఎన్నోకష్టాలు, నష్టాలు, అపోహలు అవరోధాలను ఎదుర్కొని అహర్నిశలు తెలుగు జాతి ఉన్నతి కోసం శ్రమించిన మహోన్నత నాయకుడు నారా చంద్రబాబు. ఆయన జీవితం తెరిచిన పుస్తకం... మచ్చలేని చంద్రుడు ఆయన. సమాజాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళ్ళాలి.. సమాజాభివృద్ధే తన లక్ష్యంగా జీవనం సాగించిన ఏకైక వ్యక్తి చంద్రబాబు. రాజకీయాల్లో అపరచాణిక్యుడిగా, అభివృద్ధిలో తిరుగులేని వ్యక్తిగా ఎందరో గొప్ప గొప్ప వ్యక్తుల ప్రశంసలు పొందారు చంద్రబాబు. బిల్ గేట్స్, బిల్ కింటన్ , సుందర్ పిచ్చయ్, చంద్రశేఖరన్ లాంటి వ్యక్తులు ప్రశంసించారంటే సమాజం పట్ల ఆయనకు ఉన్న ధ్యేయం, సమాజం అభివృద్ధి చెందాలని నిరంతరం తప్పించే ఆయన ఆలోచన విధానం, ఆయన ముందు చూపు నేటి తరానికి ఆదర్శమని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

అధికారం ఉన్నా.. అధికారం లేకపోయిన ప్రజలతో మమేకైన ఒకే ఒక వ్యక్తి భారత దేశ చరిత్రలో చంద్రబాబు నాయుడు ఒక్కరే. తెలుగు జాతీ గర్వించే వ్యక్తి చంద్రబాబు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపడితే.. తెలుగు ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచిన వ్యక్తి చంద్రబాబు. సుధీర్ఘకాలం ఒక మహిళ దేశ ప్రధానిగా ఉన్నా.. మహిళల గురించి ఆమె ఏం పట్టించుకున్నారో తెలియాదు కాని... మహిళాసాధికారత అనే పదానికి అర్థం పరామర్థం చెప్పిన ఏకైక వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు మాత్రమే. సంక్షేమ పథకాలతో సామాజిక మార్పు తీసుకు వచ్చిన అనితర సాధ్యుడు చంద్రబాబు. సమాజంలో సగభాగమైన బీసీలను గుర్తించింది కూడా తెలుగుదేశం పార్టీనే... బీసీలకు న్యాయం చేసింది టీడీపీ పార్టీనే.. ఎస్సీ, ఎస్టీల లాగే బీసీలకు కూడా సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషిన వ్యక్తి చంద్రబాబు. వాస్తవాలను మననం చేసుకోవాల్సిన అవసరం.

సమాజంలో ఏ వ్యక్తి ఎవరికోసం పాటుబడ్డారో గుర్తు చేసుకోవాల్సిన సమయం వచ్చింది. సామాజిక మార్పుకు సంకేతంగా దళితుల అభ్యున్నతికి తొలి అడుగు వేసిన వ్యక్తి చంద్రబాబు. దళితులు, మహిళలు, బీసీలు అన్నివర్గాలకు న్యాయం చేసిన మహనీయుడు చంద్రబాబు. వ్యవసాయ రాష్ట్రాన్ని పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుదే. నేడు రాజధానుల్లో మేలైన రాజధాని ఏదని చెప్పుకోవాంటే అందరూ హైదరాబాద్ నే చూపిస్తున్నారంటే ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. నాడు చంద్రబాబు విజనరీ థింకింగ్ వలనే సైబరాబాద్ సాధ్యం అయిందన్నారు.

### బెదరని, భయపడని నేత చంద్రబాబు

చంద్రబాబు నాయుడు జీవితంలో 2019 ముందు



రాజకీయాలు ఒక రకంగా 2019 తరువాత రాజకీయాలు మరొకక రకంగా ఉన్నాయి. చంద్రాబు నాయుడు చేయని తప్పుకు ఆయన్ను జైలుకు పంపారు. ఆయన ఇంటిపై దాడి చేశారు. హెరిటేజ్ పై కక్ష సాధింపుకు దిగారు. అయినా చంద్రబాబు నాయుడు భయపడలేదు. చంద్రబాబు అంటనే విజనరీ నాయకుడు, నిజాయతీ కలిగిన వ్యక్తి, హార్డ్ వర్కర్ ఈ మూడు అంశాలు ఒకే వ్యక్తిలో ఉండటం రాజకీయాల్లో అరుదు. జాతీయ రాజకీయాల్లో గొప్ప అవకాశాలు వచ్చినా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాలు రాష్ట్ర ప్రజలకోసం ఇక్కడే ఉన్నారని అశోక్ బాబు అన్నారు.

బాబు విజన్‌తో 2022 అన్నప్పుడు అప్పుడు చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడ్డారు. చంద్రబాబుపై అనేక అక్రమ కేసులు పెట్టినా ఒక్కటి కూడా నిలబడలేదు. స్వపక్షం, విపక్షం నుండి వచ్చే ఇబ్బందులను ధీటుగా ఎదుర్కొన్న వ్యక్తి ఒక్క చంద్రబాబు మాత్రమే. చంద్రబాబు ఏ నిర్ణయం తీసుకున్న సమాజాభివృద్ధికోసమే తీసుకున్నారు. సహనానికి చంద్రబాబు నిలువుటద్దం. చంద్రబాబు అంటే ఒక వ్యక్తి కాదు ఆయన ఒక బ్రాండ్. ప్రజల కోసం పాటుపడిన చంద్రబాబు జీవిత అంశాలపై ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రారంభిస్తున్నాం.

### ఆత్మవిశ్వాసానికి మారుపేరు బాబు

ఒక ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా ఉంటూ రాష్ట్ర ప్రజలకు సేవ చేసే భాగ్యం నారా చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు అందించారు. నాడు రామారావు రూ. 30 తో పింఛన్ ను స్టార్ట్ చేస్తే నేడు రూ. 4,000 లకు చంద్రబాబు తీసుకెళ్లారు. దాంట్లో చంద్రబాబు పెంచినదే రూ. 3,200 ఉంది. చంద్రబాబు సంక్షేమానికి ఎంత పెద్దపీట వేశారో ఇదే నిదర్శనమని బుచ్చిరాంప్రసాద్ అన్నారు. రామారావు తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం పోరాడితే.. చంద్రబాబు తెలుగు విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించారు.

ఆత్మవిశ్వాసంతో ఎంతో కష్టపడి నేడు అన్ని రంగాల్లో యువత ముందుకెళ్తున్నారు. విదేశాల్లో సైతం సత్తా చాటుతున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా వైద్య శిబిరాలు పెట్టి 19 లక్షల మందికి వైద్య సేవలు అందించాం. ప్రతిపక్షంలో కూడా సేవలు కొనసాగించాం. సేవంటే ఎన్టీఆర్, చంద్రబాబులే కనిపిస్తారు తప్పా ఇంకొకరు కనిపించరు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక బ్రహ్మణుల సంక్షేమానికి కృషి చేశారు. బ్రాహ్మణుల సంక్షేమానికి పాటుబడిన పార్టీ టీడీపీ మాత్రమే.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024













# జలప్రళయం





























13

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | ఆదివారం 01, సెప్టెంబర్ 2024




## 'సరిపోదా శనివారం'ని బ్లాక్ బస్టర్ చేసిన ఆడియన్స్ థాంక్ యూ: నాని

నేచురల్ స్టార్ నాని, క్రియేటివ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ బ్లాక్ బస్టర్ మూవీ 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా, %ాజీ% సూర్య పవర్ ఫుల్ రోల్ నటించిన ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మించారు. ఆగస్ట్ 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్ గా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని, హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్ నిర్వహించింది. నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. 15 రోజులు గా టీంలో ఎవరికీ నిద్రలేదు. అప్పుడు పని చేసే ఒత్తిడితో నిద్ర లేదు. ఈ మూడు రోజులు గా సక్సెస్ ఎక్సయిట్మెంట్ తో నిద్రలేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రసంశలు వస్తున్నాయి. సినిమాని మీరంతా ఆదరిస్తాని తెలుసు. థియేటర్ లో అందరితో కలసి ఆడియన్స్ ఎనర్జీ చూసినప్పుడు మేము ఇంకా తక్కువగా అంచనా వేశామనిపించింది. సినిమా బావుంటే తెలుగు ఆడియన్స్ తలమీద పెట్టుకుంటారని మరోసారి ప్రూవ్ చేసినందుకు థాంక్ యూ సో మచ్. ఇంత వర్షం లో కూడా అన్నీ చోట్ల హౌస్ ఫుల్స్ అవుతున్నాయంటే వి హేవ్ గ్రేటెస్ట్ ఆడియన్స్ ఇన్ ది వరల్డ్. ఆడియన్స్ అందరికీ థాంక్స్. మా టీం అందరి తరపున ఆడియన్స్ కి థాంక్స్ చెప్పడానికి కలిశాం. 'సరిపోదా శనివారం' నాట్ వీకెండ్ ఫిల్మ్.. 'సరిపోదా శనివారం' హియర్ ఫర్ లాంగ్ కాల్. లాంగ్ రన్ వుండబోతోంది. హెవీ రైన్స్ వుండి ఈ వీకెండ్ చూడలేకపోతే ఎలా ని భయపడకండి, సినిమా మీ చూట్టే వుంటుంది. మీ దగ్గరలోనే వుంటుంది, ఎప్పుడు కుదిరితే అప్పుడు చూడండి. చాలా స్పెషల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే మూవీ ఇది. సాయి కుమార్, శివాజీ రాజా గారు చాలా ముఖ్యమైన పాత్రలు పోషించారు. ఒక సోల్ యాడ్ చేశారు. బాయ్స్ కి ప్రియాంక బ్యాలెన్స్ చేసేసింది. ఎస్జే సూర్య గారి పెర్ఫార్మెన్స్ ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. మీ అందరికి కంటే ముందు సెట్ లో ఆయన పెర్ఫార్మెన్స్ ని ఎంజాయ్ చేశాను. ఆయనకి బిగ్ థాంక్స్, వివేక్ విషయంలో చాలా ప్రౌడ్ గా వుంది. అంటే సుందరానికీ రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి వుండేది. అది కాస్త 'సరిపోదా శనివారం'తో బ్యాలన్స్ అయిపోయింది'అన్నారు.



## 'వెంకటలక్ష్మితో యాడాది కిందట' పోస్టర్ లాంచ్

టింట్ ఫ్రీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆలేటి రాజేష్ నిర్మాతగా రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న స్వచ్ఛమైన ప్రేమ కథ చిత్రం 'వెంకటలక్ష్మితో'. 'యాడాది కిందట' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ చిత్రంలో రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్స్‌గా నటించారు. తాజాగా ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ లాంచ్ చేసి సినిమా విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'టైటిల్ చాలా బాగుంది. క్యాచీగా ఉంది. యంగ్ టీమ్ చేసిన సినిమా ఇది. షార్ట్ ఫిలింస్ తో ఫేమస్ అయిన హీరో రఘు ఈ సినిమా ద్వారా అందర్నీ ఆకట్టుకుంటాడని నమ్ముతున్నా. కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. ఇది కూడా ఓ కొత్త కంటెంట్‌తో రాబోతోందని అర్థమవుతోంది. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. చిత్ర హీరో రఘు గద్వాల మాట్లాడుతూ.. 'నూతన నటీనటులతో ఏడాది కిందట ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం. ప్రమోషన్స్‌లో భాగంగా హీరో శ్రీకాంత్ గారు మాకు సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. శ్రీకాంత్ గారికి మా టీమ్ తరపున స్పెషల్ థాంక్స్' అని చెప్పారు.

## 'సుబ్రహ్మణ్య', ప్రీ-లుక్ పోస్టర్

ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.రవిశంకర్ తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేసేందుకు సెకెండ్ టైమ్ మెగాఫోన్ పట్టారు. "సుబ్రహ్మణ్య" టైటిల్ తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల ప్రతిష్టాత్మకంగా ఎస్‌జి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం 2గా నిర్మిస్తున్నారు. ఈ మూవీ 'గుణ 369' సక్సెస్ తర్వాత తర్వాత, సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ జానర్‌లో ప్రొడక్షన్ హౌస్‌కి తొలి చిత్రంగా నిలిచింది. శ్రీమతి ప్రవీణ కడియాల, శ్రీమతి రామలక్ష్మి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ప్రొడక్షన్ హౌస్ సుబ్రహ్మణ్య ప్రీ-లుక్‌ను రివిల్ చేసింది. పోస్టర్ సినిమా కోసం క్రియేట్ చేసిన ఫాంటసీ వరల్డ్ లోకి స్నీక్ పీక్‌ను అందిస్తుంది. మూవీ ఆర్ట్‌వర్క్ గ్రాండియర్ గా వుంది. ఈ స్పెల్‌బైండింగ్ ప్రీ లుక్ సినిమాపై ఎక్సయిట్మెంట్ క్రియేట్ చేసింది. ప్రీమియం లార్జ్ ఫార్మాట్, ఐమాక్స్



థియేటర్‌లలోని ప్రేక్షకులకు అడ్వంచర్ థ్రిల్‌ను అందించ డానికి ఈ చిత్రాన్ని బిగ్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ గ్రాండ్ ప్రాజెక్ట్ విజువల్, ఎమోషనల్ ట్రీట్‌గా అద్భుతమైన కథతో సెట్ చేయబడింది.

## 'ప్రణయ గోదారి' నుంచి మాస్ బీట్ రిలీజ్



ప్రస్తుతం ఫీల్ గుడ్ స్టోరీస్, చిన్న చిత్రాలు, కొత్త టీం చేస్తున్న ప్రాజెక్టులు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అవుతున్నాయి. ఆ కోవలోనే న్యూ కంటెంట్‌తో రిఫ్రెషింగ్ ఫీల్‌తో రూపొందుతున్న చిత్రం 'ప్రణయగోదారి'. పి.ఎల్.విఘ్నేష్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఫీల్ గుడ్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సదన్ హీరోగా, యాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన కంటెంట్ అందరినీ ఆకట్టుకుంది. ప్రణయ గోదావరి గ్లింప్స్, పోస్టర్లు, పాటలు ఆడియెన్స్‌లో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. తాజాగా మరో పాటను మేకర్లు విడుదల చేశారు. గు గు గ్గు.. అంటూ సాగే ఈ హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాటకు మార్కండేయ బాణీ, సాహిత్యం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. భార్గవి పిల్లై గాత్రం కుర్రకారుని కట్టి పడేసేలా ఉంది. పాటను రిలీజ్ చేసిన అనంతరం గణేష్ మాస్టర్ మాట్లాడుతూ.. 'ప్రణయ గోదారి సినిమాలోని గు గు గ్గు... అనే ప్రత్యేక గీతాన్ని విడుదల చేశాను. పాట చాలా బాగుంది. హుక్ స్టెప్స్ బాగున్నాయి. ఈ మూవీని అందరూ ఆదరించాలి. విఘ్నేశ్ గారు తెరకెక్కించిన ప్రణయ గోదావరి పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## '35-చిన్న కథ కాదు' అందరూ రిలేట్ అయ్యే బ్యూటీఫుల్ స్టోరీ: హీరోయిన్ నివేత థామస్

నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్."35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. "35-చిన్న కథ కాదు" సెప్టెంబర్ 6న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ నివేత థామస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.



**'35-చిన్న కథ కాదు'లో మదర్ రోల్‌లో కనిపిస్తున్నారు కదా..మదర్ క్యారెక్టర్ ఆఫర్ చేసినప్పుడు ఎలా అనిపించింది?**

-'35-చిన్న కథ కాదు' సింపుల్ అండ్ బ్యూటీఫుల్ స్టోరీ. స్టార్ట్ టు ఫినిష్ ఆ వరల్డ్ లో కాంప్రమైజ్ లేకుండా రాసిన స్టోరీ. నివేత థామస్ కాకుండా సరస్వతి పాత్రే కనిపిస్తుంది. ఇలాంటి పాత్ర చేయడం నాకు చాలా ఇష్టం.

-ఇండియన్ సొసైటీలో 22 ఏళ్లకే ఎప్పుడు పెళ్లి చేసుకుంటారని జనరల్ గా అడుగుతారు. నేను హౌస్ వైఫ్ క్యారెక్టర్ చేయడంలో పెద్ద ప్రాబ్లమ్ లేదు. యాక్టర్ గా అన్ని పాత్రలు చేయాలి. మదర్ గా బాగా చేశాను అనే బదులు సరస్వతి పాత్రని బాగా చేశానని మీరంతా చెబితే సంతోషిస్తాను(నవ్వుతూ). నాకంటూ ఒక ప్యాట్రన్ ని సెట్ చేసుకోవడం నాకు ఇష్టం వుండదు. నివేత ఏ పాత్రనైనా చేయగలదని దర్శకులు నమ్మగలిగితే యాక్టర్‌గా అంతకు మించిన ఆనందం మరొకటి వుండదు.

-ఇందులో సరస్వతి పాత్రకు నాకు ఏజ్‌లో పెద్ద తేడా లేదు. సరస్వతి ఏజ్ లో నాకంటే ఏడాది చిన్నది. తనకి చిన్న ఏజ్ లోనే పెళ్లి అవుతుంది. ఆమెకి పిల్లలు ఉన్నప్పటికీ ఆమెలో ఒక చైల్డ్ నేచర్ వుంటుంది. ఇందులో యూత్ లవ్ వుంటుంది. ఇవన్నీ ఎక్స్ ఫ్లోర్ చేయడం నాకు చాలా ఎక్సయిటింగ్ గా అనిపించింది.

**ఈ కథలో మిమ్మల్ని ఎక్సయిట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి ?**

-35-చిన్న కథ కాదు వెరీ రూటెడ్ స్టోరీ. డైరెక్టర్ నంద కిషోర్ కథని అద్భుతంగా రాశారు. ఇందులో తిరుపతి తిరుమల వేంకన్న స్వామి కూడా కథలో ఒక క్యారెక్టర్. కథ ఇంత రీజినల్‌గా రూటెడ్‌గా వుండటం నాకు చాలా నచ్చింది. డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో వుంటుంది. ఎన్నోసెంట్ ఫ్యామిలీ స్టోరీ ప్రేక్షకులకు చాలా నచ్చుతుంది.

**ఇది ఎడ్యుకేషన్ స్టోరీనా ?**

-మ్యాథ్స్ అనేది చిన్న పార్ట్ మాత్రమే. ఇందులో చాలా మాస్ మూమెంట్స్ క్లాస్ రూమ్ నుంచే వస్తాయి. చాలా నోస్టాల్జియా మూమెంట్స్ వుంటాయి. భార్య భర్త, పిల్లలు, టీచర్ స్టూడెంట్స్ ఇలాంటి బ్యూటీఫుల్ రిలేషన్షిప్స్ గురించి చాలా అందంగా చెప్పడం జరిగింది. ఇది కె విశ్వనాథ్ గారి సినిమాలు చూసిన ఫీలింగ్ ఇస్తుంది.

**35-చిన్న కథ కాదు.. టైటిల్ మార్కులని ఉద్దేశించి పెట్టినదేనా ?**

-అవును. మ్యాథ్స్ లో పిల్లలకి చాలా ఫండమెంటల్ డౌట్స్ వుంటాయి. ఇందులో మా పెద్దబ్బాయికి అన్ని సబ్జెక్ట్స్ వస్తాయి కానీ మ్యాథ్స్ లో చాలా ప్రాబ్లమ్స్ వుంటాయి. అవి చాలా మంది రిలేట్ చేసుకునేలా వుంటాయి.

## 'గబ్బర్ సింగ్' అంటేనే ఓ చరిత్ర : నిర్మాత బండ్ల గణేష్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ క్రేజీ కాంబోలో చరిత్ర సృష్టించిన మూవీ 'గబ్బర్ సింగ్'. పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత బండ్ల గణేష్ నిర్మించిన ఈ



చిత్రం 2012లో విడుదలై కలెక్షన్ల వర్షం కురిపించి ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న 'గబ్బర్ సింగ్' రీరిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో రీ-రిలీజ్ ప్రెస్ మీట్ గ్రాండ్ గా జరిగింది. నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. నా తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నాకు బ్రతుకుని ఇచ్చారు. పవన్ కళ్యాణ్ గారి గురించి నేను ఎంత చెప్పుకున్నా తక్కువే. నేను ఆర్థికంగా ఎంత స్థాయికి వెళ్ళినా పవన్ కళ్యాణ్ గారు లేకపోతే నాకు ఈ క్రేజ్, పేరు ఉండేది కాదు. పవన్ కళ్యాణ్ ఒక రోజు పిలిచి సినిమా నిర్మించే అవకాశం ఇచ్చారు. నన్ను నేను నమ్మలేని పరిస్థితిలో పవన్ కళ్యాణ్ గారు నమ్మారు. ఎవరు ఎన్ని చెప్పినా.. 'గణేష్ కి మాటిచ్చాను. తనతో సినిమా చేస్తానని' నన్ను నిర్మాతగా నిలనెట్టారు. ఈ సందర్భంగా మరొక్కసారి పవన్ కళ్యాణ్ గారికి పాదాభివందనాలు తెలియజేసుకుంటున్నాను. గబ్బర్ సింగ్ ఒక చరిత్ర. రీ రిలీజ్ కి ఇంత క్రేజ్ ఏంటని కొందరు అడుగుతున్నారు. హిందువులకు భగవద్గీత, ముస్లింలకు ఖురాన్, క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమైనదో పవన్ కళ్యాణ్ అభిమానులకు గబ్బర్ సింగ్ అంత పవిత్రమైనదని వారికి చెప్పాను. గబ్బర్ సింగ్ సినిమాని అణువణువునా ప్రతి అడుగు ప్రతి మాట ప్రతిక్షణం ప్రతి కష్టం డైరెక్టర్ హరీష్ శంకర్ కి చెందుతుంది. హరీష్ శంకర్ ఏది చెప్తే అది చేద్దాం అని పవన్ కళ్యాణ్ గారు సినిమా ప్రారంభమైన రోజునే చెప్పారు. హరీష్ శంకర్ రాబోయే పాతికేళ్ళు తెలుగు సినిమాలో నెంబర్ వన్ డైరెక్టర్ గా వుంటారు. పవన్ కళ్యాణ్ గారి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే, ఆయన గొప్ప మానవత్వం ఉన్న వ్యక్తి. నిజాయితీ నిబద్ధత కలిగిన వ్యక్తి. భారతదేశంలో ఏ నటుడు పొందలేనంత అత్యధిక రేమ్యునిరేష్ పొందగలిగే స్టార్ అయినప్పటికీ హాయిగా బ్రతికే కెపాసిటీ ఉన్న పవన్ కళ్యాణ్ అన్నీ వదిలేసి జనం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. దాదాపు 10ఏళ్లు ప్రజల కోసం పోరాడి ఈ రోజు ఒక స్థాయికి వచ్చారు. అంతటి గొప్ప వ్యక్తిత్వం వున్న పవన్ కళ్యాణ్ గారితో గబ్బర్ సింగ్ సినిమా తీయడం నా అదృష్టం. నేను, హారిస్, దేవిశ్రీ ప్రసాద్ అందరూ ప్రేమించి ఈ సినిమా చేశాం. పవన్ కళ్యాణ్ అభిమానులు చాలా క్రమశిక్షణగా వుంటారు. మా వాళ్ళు థియేటర్స్ కి ఎలాంటి ఇబ్బంది కలిగించరని పవన్ కళ్యాణ్ భక్తుడిగా మాటిస్తున్నాను. పవన్ కళ్యాణ్ గారు నేడు ఉపముఖ్యమంత్రి. ఆయన అభిమానులమైన మేము ఎంతో క్రమశిక్షణగా మెలుగుతాం. గబ్బర్ సింగ్ సినిమా చూస్తే మాకు దైవదర్శనం. కాబట్టి మా దైవదర్సనానికి ఆటంకం కలిగించవద్దని రిక్వెస్ట్ చేస్తున్నాం'అన్నారు.


Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144